TIMES OF VARTHA (20-03-24)_times of varha main (13-2).qxd 3/20/2024 5:28 AM Page 1


# టైమ్స్ ఆఫ్ వార్త

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : గూడూరు జనార్ధన్ రెడ్డి

తెలంగాణ | బుధవారం, 20 - మార్చి - 2024 | సంపుటి : 16 | సంచిక : 255 | పేజీలు 07 | వెల : 6/-


### లోక్‌సభ అభ్యర్థుల ఎంపికపై

## కాంగ్రెస్ కసరత్తు పూర్తి..!



- ప్రకటన వెలువడక పోవడంతో ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ
- 8 స్థానాలకు పేర్లు ఖరారయ్యాయంటున్న ఏఐసీసీ వర్గాలు
- ఐదు స్థానాలకే క్లియరెన్స్ వచ్చిందంటూ గాంధీభవన్ వర్గాల్లో చర్చ
- ఒకటి, రెండురోజుల్లో అధికారికంగా జాబితా విడుదల!
- ఇప్పటివరకు నాలుగు నియోజకవర్గాలకే అభ్యర్థుల ప్రకటన

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి రెండో విడత జాబితా ప్రకటనపై కాంగ్రెస్ పార్టీ కసరత్తు పూర్తి చేసింది. నేతల జనాదరణను పరిగణనలోకి తీసుకుని పేర్లు ఫైనల్ చేసినట్లు సమాచారం. అయితే దీనిపై ఎలాంటి ప్రకటనా వెలువడక పోవడంతో.. ఎన్ని స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు, ఎవరెవరికి టికెట్లు లభించాయన్న దానిపై ఆశావహుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. ఎనిమిది చోట్ల అభ్యర్థులు ఫైనల్ అయ్యారని ఏఐసీసీ వర్గాలు చెబుతుండగా, ఆరు స్థానాలు పరిశీలించినా, ఐదుగురు అభ్యర్థుల ఎంపిక మాత్రమే పూర్తయిందనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

**సీఈసీ ఆమోద ముద్ర:**

ఢిల్లీలో మంగళవారం సాయంత్రం సీఈసీ సమావేశం జరిగింది. తెలంగాణ సహా వివిధ రాష్ట్రాలకు సంబంధించి పలువురు అభ్యర్థులకు ఆమోదముద్ర వేసింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీ, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మంత్రి ఉత్తమ్ సహా కమిటీ ఇతర సభ్యులు ఈ భేటీలో పాల్గొన్నారు. తెలంగాణకు సంబంధించి చర్చ జరిగినప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఆదివారం ముంబైలో జరిగిన రాష్ట్ర స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఖరారు చేసిన జాబితాపై చర్చించారు.

**13 మందిని ప్రకటించాలనుకున్నా..**

తొలి జాబితాలో జహీరాబాద్, మహబూబాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన 13 స్థానాలకు అభ్యర్థుల ఖరారుపై పార్టీ పెద్ద ఎత్తున కసరత్తు జరిపింది. ఏఐసీసీ వర్గాల సమాచారం ప్రకారం..13 మంది అభ్యర్థుల పేర్లను సీఈసీలో చర్చించి ఒకేసారి

మిగతా 7లో..

## కాలుష్య రాజధానిగా ఢిల్లీ





- ప్రపంచంలోనే అత్యధిక కాలుష్య మెట్రోప్రాంతంగా బిహార్‌లోని బెగుసరాయ్‌కు టాప్ ర్యాంక్
- ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక వెల్లడి

**న్యూఢిల్లీ:** 'అత్యంత కాలుష్య దేశ రాజధాని' అప్రతిష్ట కిరీటాన్ని ఢిల్లీ మరోసారి తన నెత్తిన పెట్టుకుంది. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూఎయిర్ సంస్థ ప్రపంచ వాయు నాణ్యతా నివేదిక-2023లో పలు అంశాలను ప్రస్తావించింది. నివేదికలో వెల్లడైన వివరాల ప్రకారం.. ప్రపంచంలోనే అత్యంత కాలుష్యంతో నిండిన మెట్రోపాలిటన్ ప్రాంతంగా బిహార్‌లోని బెగుసరాయ్ నిలిచింది. ఘనపు మీటర్‌కు 54.4 మైక్రోగ్రామ్‌ల చొప్పున వార్షిక సూక్ష్మధూళికణాల(పీఎం 2.5) గాఢత ఉన్న దేశాల జాబితాలో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 79.9 మైక్రోగ్రామ్‌లతో బంగ్లాదేశ్ తొలిస్థానంలో, 73.7 మైక్రోగ్రామ్ లతో పాకిస్థాన్ రెండోస్తానంలో నిలిచింది. గత ఏడాది ఘనపు మీటర్‌కు కేవలం 53.4 మైక్రోగ్రామ్‌ల వార్షిక సూక్ష్మధూళి కణాల(పీఎం 2.5)గాఢతతో భారత్ ఎనిమిదో స్థానంలో ఉండగా ఇటీవలికాలంలో దేశంలో కాలుష్యం విపరీతంగా కమ్ముకుని భారత స్థానం దారుణంగా మూడో స్థానానికి ఎగబాకడం ఆందోళనకరం. ఇక బిహార్‌లోని బెగుసరాయ్ గత ఏడాది కాలుష్యప్రాంతాల జాబితాలోనే లేదు. కానీ ఈ ఏడాది ఘనపు మీటర్‌కు 118.9 మైక్రోగ్రామ్‌ల పీఎం2.5 గాఢతతో ప్రపంచంలోనే అతి కాలుష్య మెట్రోపాలిటన్ పట్టణంగా అప్రతిష్టను మూటగట్టుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో గువాహటి, ఢిల్లీ, పంజాబ్‌లోని ముల్లాన్‌పూర్ నిలిచాయి.

**నాలుగుసార్లు టాప్ ర్యాంక్**

ఢిల్లీ పీఎం2.5 గాఢత గత ఏడాది 89.1 మైక్రోగ్రాములు ఉంటే ఈసారి మరికాస్త పెరిగి 92.7 మైక్రోగ్రాములకు చేరుకుంది. దీంతో విపరీతమై కాలుష్యం కారణంగా 2018 ఏడాది నుంచి చూస్తే నాలుగుసార్లు మోస్ట్ పొల్యూటెడ్ క్యాపిటల్ సిటీ కిరీటాన్ని ఢిల్లీకే కట్టబెట్టారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ఒక ఘనపు మీటర్‌కు 5 మైక్రోగ్రాములకు మించి సూక్ష్మధూళి కణాలు ఉండకూడదు. కానీ భారత్‌లోని 136 కోట్ల ప్రజలు అధిక వాయుకాలుష్యం బారిన పడ్డారని తాజా నివేదిక

మిగతా 7లో..

## ఎన్నికల ప్రచారానికి ఇవీ షరతులు

- తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు, రాజకీయపార్టీలు అనుసరించాల్సిన విధివిధానాలపై ఎన్నికల సంఘం స్పష్టత ఇచ్చింది. షరతులనూ ప్రకటించింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు బైక్ ర్యాలీలు, రోడ్ షోలు నిబంధనలకు లోబడే ఉండాలని పేర్కొంది. పై ర్యాలీల్లో ఎన్ని వాహనాలు పాల్గొంటాయో ముందస్తుగా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఒకే వరుసలో కాకుండా ప్రతి 10 వాహనాల తర్వాత కనీసం వంద మీటర్ల దూరం ఉండేలా ర్యాలీలు నిర్వహించాలి. అభ్యర్థుల కాన్వాయ్ లో సెక్యూరిటీతో సహా పది వాహనాలకు మించి ఉండకూడదు. వాహనాలకు అమర్చే జెండాలు, జెండా కర్రల సైజును కూడా ఎన్నికల సంఘం నిర్ణయించింది. జెండా కర్రల ఎత్తు మూడు అడుగులకు మించి ఉండకూడదు. లౌడ్ స్పీకర్లను రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ఉపయోగించకూడదు. వీటి అనుమతికి కచ్చింతంగా సంబంధింత అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలి. జెండాల వినియోగంపైనా షరతులు విధించింది. ప్రచారం కోసం తాత్కాలిక క్యాంప్ కార్యాలయాలను నిబంధనలకు లోబడే ఏర్పాటు చేసుకోవాలని చెప్పింది. ఫోన్లలో సంక్షిప్త సందేశాలపైనా షరతులు విధించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు లోబడే ఇవి ఉండాలని పేర్కొంది. పోలింగ్ స్టేషన్ల వద్ద ఎలాంటి పార్టీ గుర్తులు, గోడరాతలు, నినాదాలు, బ్యాడ్జీలు ఉండరాదు. స్కూల్ గ్రౌండ్లను ఎన్నికల ప్రచారం కోసం వినియోగించుకుంటే నిబంధనల్ని కచ్చింతంగా పాటించాలి. రాజకీయపార్టీల స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం కూడా నిబంధనలకు లోబడే ఉండాలి. వారి రూట్ మ్యాప్ ముందస్తుగా సంబంధిత అధికారులకు అందచేయాలి. ఎన్నికల నియమనిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ స్పష్టం చేశారు.

## కొత్త గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



- జారండ్ గవర్నర్‌కు తెలంగాణ అదనపు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- నేడు రాజ్‌భవన్‌లో గవర్నర్‌గా బాధ్యతల స్వీకరణ
- గతంలో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

రాష్ట్ర నూతన గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియమితులయ్యారు. తమిళిసై సౌందరరాజన్ రాజీనామాతో జారండ్ గవర్నర్‌గా ఉన్న రాధాకృష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు మంగళవారం ఉదయం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా కూడా ఆయనకే అదనపు బాధ్యతలను అప్పగించారు. బుధవారం ఉదయం రాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళవారం రాత్రి 8.20కి జారండ్ నుంచి బయల్దేరి రాత్రి 11.05 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకోనున్నారు. బుధవారం రాజ్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే.. గవర్నర్‌గా రాధాకృష్ణన్‌తో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు.

తాజా, మాజీలు ఇద్దరూ తమిళనాడు బీజేపీ అధ్యక్షులే

మిగతా 7లో..

### ఎకరాకు రూ. 10 వేల

## పరిహారం చెల్లించాలి



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బిఆర్ఎస్ అగ్రనాయకులు, మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసిందని, పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీ రు మిగిల్చిందని పేర్కొన్నారు.వరి, మొక్కజొన్న, జొన్న పంటలతోపాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గతం లో అకాల వర్షాల వల్ల రైతులు నష్టపోతే, అప్పటి సిఎం కెసిఆర్ స్వయంగా వెళ్లి రైతులను పరామర్శించి భరోసా కల్పించి, అక్కడికక్కడే ఎకరాకు రూ.10వేల నష్టపరిహారం ప్రకటించి అమలు చే శారని గుర్తు చేశారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రభు త్వం నుంచి కనీసం స్పందించడం లేదని అన్నారు. రాజకీయాలు తప్ప, రైతు ప్రయోజనాలు పట్ట ని కాంగ్రెస్.. ఇప్పటికైనా మేల్కొని అన్నదాతకు అం డగా నిలవాలని కోరారు. జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయడంతో పాటు, ఎకరాకు రూ.10వేల నష్ట పరిహారం చెల్లించాలని హరీశ్‌రావు బిఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

TIMES OF VARTHA (20-03-24)_times of varha main (13-2).qxd 3/20/2024 5:28 AM Page 2



## భీంగల్ బస్ డిపోను అభివృద్ధి చేయండి



### మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం అందజేసిన డిసిసి అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి భీంగల్ బస్ డిపోలో పూర్తి స్థాయి అధికారులను నియమించి డిపో అభివృద్ధికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. 1989లో కాంగ్రెస్ ప్రభుత్వంలో బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మండలంలో ఏర్పాటు చేసిన భీంగల్ బస్ డిపోను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించి కొన్ని సంవత్సరాలుగా మూసివేయడం జరిగిందని, ఇటీవల బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎన్నికల్లో లబ్ధిపొందాలనే ఆలోచనతో సుమారు నాలుగు నెలల క్రితం బస్ డిపోను పునఃప్రారంభించి ప్రజలను మభ్యపెట్టిందని ఆయన ఆరోపించారు. కానీ ఇప్పటివరకు పూర్తి స్థాయిలో బస్సులను గాని, సిబ్బందిని గాని నియమించడం జరగలేదన్నారు. కావున పునఃప్రారంభమైన భీంగల్ బస్ డిపోను పూర్తిస్థాయిలో సిబ్బందిని, బస్సులను ఏర్పాటు చేసి భీంగల్ చుట్టుప్రక్కల ఉన్న ప్రజలకు మరింత సౌకర్యం కల్పించే విధంగా ప్రయత్నించి సకలసౌకర్యలు ఏర్పాటు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. మంత్రిని మర్యాదపూర్వకంగా శాలువా, ఫ్లవర్ బొకే తో సన్మానించారు. ఆయనతో పాటు పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు వేణు రాజ్, బాల్కొండ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్ర, మహేష్, నిఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాకు చేరుకున్న భీంరావ్ మహారాజ్ మహా కాలినడక



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

24 వేల కిలోమీటర్ల భీమ్రావు మహారాజ్ మహా కాలినడక నిజామాబాద్ జిల్లాకు చేరుకుంది. కామారెడ్డి జిల్లా ముగించుకొని మంగళవారం నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలో మాదిగలు మహారాజులు అని గుర్తు చేస్తూ సంత్ రవిదాస్ మహారాజ్ సాంస్కృతిక ఉద్యమానికి కొనసాగింపుగా, మహాఆదిగలు (మాదిగలు) కోల్పోయిన రాజ్యం, గౌరవం, సంపదలు తిరిగి తెచ్చుకోవడానికి, అనుసరించాల్సిన జీవన విధానం గురించి తెలియజేస్తూ మాదిగ సమాజాన్ని చైతన్యం చేయడానికి మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో 24 వేల కిలోమీటర్ల మహా కాలినడక ద్వారా తెలంగాణ వ్యాప్తంగా నాలుగు సంవత్సరాల పాటు గొప్ప సంకల్పంతో నిజామాబాద్ జిల్లాకు చేరుకుంది. అయితే ఇందల్వాయి, చంద్రాయన్ పల్లి, లోలం గ్రామాలకు చేరుకున్న మాదిగ కుల గురువు భీంరావ్ మహారాజు చేరుకున్నారు. వారికి ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా ఆహ్వానించి వారి సందేశాన్ని విని ఆ మార్గంలో ప్రయాణిస్తామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం జె ఎస్ జిల్లా కన్వీనర్ నాగేశ్వర్ రావు, కో కన్వీనర్లు సంతోష్, రాజు, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.


## పాతాళ గంగ ను పైకి తేవడానికి భగీరథ ప్రయత్నం

టైమ్స్ ఆఫ్ వార్త - మోతె



కోదాడ మోతె మంగళవారం మండల కేంద్రంలోని రైతు సాగునీటి కోసం పాతాళ గంగ ను పైకి రప్పించడానికి భగీరథ ప్రయత్నం చేస్తున్నాడు. అరు గాలం కష్టించి పని చేసి సాగు చేసిన వరి పంట సాగుకు సరిపడ నీరు లేక పొట్ట మీద కు వచ్చిన వరి పంట ఎండటానికి సిద్దంగా ఉండటం చేసేది లేక పాతాళం లో ఉన్న గంగమ్మ ను పైకి తెచ్చి పంట ను కాపాడు కోవడం కోసం తిప్పలు తప్పడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్ష కాలంలో అరు ఎకరాల భూమిని సాగు చేస్తే బావిలో ఉన్న నీరు సరి పోయేది ఏసంగి కి కనీసం మూడు ఎకరాలు కూడా నీటి పారుదల కావడం లేదని తెలిపారు. మండలంలో కరువు ఛాయలు కమ్ముకొని కనిసం త్రాగటానికి కూడా నీటికి కటకట అయ్యే అవకాశం ఉందని పలువురు రైతులు చర్చించు కొంటున్నారు.

### రైతు సామ పెద్ద వెంకట్ రెడ్డి వివరణ



బావిలో నిత్యం నీళ్ళు ఉండేవి ప్రస్తుతం కరువు కారణంగా భు గర్బ జలాలు అంతరించుక పోయాయని సుమారు యాభై ఫీట్లు లోతులో నీటి నీ క్రెన్‌లతో మళ్ళీ పాత పద్ధతి ప్రకారం నీటి నిల్వలు పెంచుకొని పంటను కాపాడు కోవడం జరుగుతుందని తెలిపారు.

# న్యాయం చేయాలని విద్యార్థుల ఆందోళన



టైమ్స్ ఆఫ్ వార్త -మందమర్రి:

మంచిర్యాలకు చెందిన వివేకానంద పాలిటెక్నిక్ కళాశాల యాజమాన్యం తరగతులు నిర్వహించకుండా విద్యార్థుల జీవితం తో చెలగాటమాడుతుందని, తమకు న్యాయం చేయాలని కళాశాల విద్యార్థులు డిమాండ్ చేశారు. కళాశాల మేనేజ్మెంట్లో ఒకరైన పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సిద్దయ్య నివాసమైన పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం కళాశాల విద్యార్థులు తమకు న్యాయం చేయాల్సిందిగా ఆందోళన నిర్వహిస్తూ, న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రానున్న మరో నెలలో తమకు సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయని, గత మూడు నెలలుగా తమకు ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదని, కళాశాలను సైతం మూసివేస్తున్నట్టు తెలిపారు. దీంతో తమ భవిష్యత్తు ఆగమ్య గోచరంగ మారిందని, ఈ పరిస్థితుల్లో తాము వేరే కళాశాలలో సైతం చేరలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలను యధావిధిగా నిర్వహిస్తూ, తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లిన స్పందన కరువైందని వాపోయారు. ఇదే విషయమై కళాశాల యాజమాన్యాన్ని ప్రశ్నించిన వారి నుండి సమాధానం లేదని, ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించడం లేదని తెలిపారు. ఈ విషయమై కళాశాల మేనేజ్మెంట్ లో ఒకరైన లిటిల్ ఫ్లవర్స్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ సిద్దయ్య ను అడుగుదామని నేడు వారి నివాసమైన లిటిల్ ఫ్లవర్స్ పాఠశాలకు రావడం జరిగిందన్నారు. కానీ పాఠశాల ప్రిన్సిపల్, సిద్దయ్య సతీమణి రమ కళాశాలకు మాకు ఎటువంటి సంబంధం లేదని తెలుపుతూ, విద్యార్థులంమని చూడకుండా, తాము ఎంత మర్యాదగా మాట్లాడిన ఆమె మాత్రం తమపై దురుసుగా మాట్లాడటం తోపాటు తమను పాఠశాల ఆవరణ నుండి వెళ్లిపోవాలని, లేని పక్షంలో కేసు నమోదు చేయిస్తామని, బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. ప్రభుత్వ,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, తమకు న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ విషయమై పాఠశాల కరస్పాండెంట్ సిద్దయ్యను వివరణ కోరగా, ఆయన ముందుగా నాకు కళాశాలకు ఎలాంటి సంబంధం లేదని తెలుపుతూనే మరలా తనతో పాటు ఐదుగురు పార్టనర్స్ ఉన్నారని ఇక్కడ ఆందోళన చేసినట్లు అక్కడ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. గత తొమ్మిది సంవత్సరాలుగా తాను ఆ కళాశాలకు వెళ్లలేదని, కళాశాల ఇబ్బందుల్లో ఉండగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కళాశాల కమిటీ లో ఒక్కరైనా నర్సింగరావు పిలుపు మేరకు కొన్ని నెలల క్రితం కళాశాలకు వెళ్ళాగా, మరల గత మూడు నెలల నుండి తాను వెళ్లడం లేదని వివరించారు. పాఠశాల కమిటీ లో తనకు ఎలాంటి బాధ్యతలు లేవని, కనీసం తాను కళాశాల కమిటీ సభ్యుని సైతం కానని, అలాంటప్పుడు కళాశాలకు తనకేం సంబంధం అని, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ఏమన్నా ఇబ్బందులు ఉంటే చట్టరీత్యా ముందుకు వెళ్లాలని సూచించారు. విద్యార్థులు తెలిసి తెలియక తనపై ఆరోపణలు చేస్తూ పాఠశాలకు రావడం జరిగిందన్నారు. ఇదే విధంగా తనపై, తన పాఠశాల పై ఆరోపణలు చేస్తే చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా కళాశాలకు రావాల్సిన స్కాలర్షిప్ బకాయిలు రాకపోవడంతోనే కళాశాలను కొనసాగించలేని పరిస్థితి నెలకొందని. ఈ విషయమై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ వద్ద ఆందోళన నిర్వహించాల్సిందిగా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం స్కాలర్షిప్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల భవనానికి అద్దె చెల్లించలేదని, సదరు భవన యజమాన్యం భవనాన్ని ఖాళీ చేయాలంటున్నారని, అదేవిధంగా ఫ్యాకల్టీకి జీతాలు సైతం చెల్లించడం లేదన్నారు. ఈ విషయమై విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గానీ, కళాశాల భవనం వద్ద కానీ ఆందోళన చేయాలని సూచించారు. ఈ విషయంలో తాము ఏమి చేయలేమని తెలిపారు.

# ఎన్నికల సన్నద్ధత చర్యలు మరింత ముమ్మరం

### ఆర్మూర్, బాల్కొండ సెగ్మెంట్లలో విస్తృతంగా పర్యటించిన కలెక్టర్, సీ.పీ

### పోలింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, చెక్ పోస్టుల పరిశీలన

### ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ కలెక్టరేట్



పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ మంగళవారం బాల్కొండ, ఆర్మూర్ శాసనసభ నియోజకవర్గ కేంద్రాల పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ ఎన్నికల సన్నద్ధతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాల్కొండ శాసనసభ సెగ్మెంట్ కు సంబంధించి భీంగల్ పట్టణంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియ కొనసాగనుంది. ఈ నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, ఎన్నికల సామాగ్రిని భద్రపర్చే స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ లుగా వినియోగించే ప్రభుత్వ జూనియర్ కళాశాల గదులను కలెక్టర్, సీ.పీ సందర్శించారు. ఆర్మూర్ అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని పరిశీలించారు. క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాలు, ఫైర్ అలారమ్ వంటి వాటిని బిగించాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో సగటున సుమారు 76 శాతం పోలింగ్ జరుగగా, 73 వ పోలింగ్ స్టేషన్ పరిధిలో మాత్రం అతి తక్కువగా కేవలం 55 శాతం ఓటింగ్ మాత్రమే నమోదు కావడంతో అందుకు ఏమైనా ప్రత్యేక కారణాలు ఉన్నాయా అని కలెక్టర్ స్థానిక అధికారులను ఆరా తీశారు. పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగేలా ఓటర్లలో చైతన్యం పెంపొందించాలని సూచించారు. ఓటింగ్ శాతం తగ్గడానికి ఏదైనా ప్రత్యేక కారణాన్ని గమనిస్తే, దానిని అధిగమించేందుకు ఇప్పటినుండే క్షేత్రస్థాయిలో కృషి చేయాలన్నారు. కాగా, ఎన్నికలలో ప్రలోభాలను నిరోధించేందుకు వీలుగా నెలకొల్పిన చెక్ పోస్టులను సైతం కలెక్టర్, సీ.పీ క్షేత్ర స్థాయిలో సందర్శించి అధికారులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పెర్కిట్ శివారులో గల చెక్ పోస్టుతో పాటు, బడా భీంగల్, కమ్మరపల్లి శివారులోని చెక్ పోస్టులను తనిఖీ చేశారు. నిరంతరంగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా గట్టి భద్రతా చర్యలు చేపట్టాలని సీ.పీ కల్మేశ్వర్ సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ ఆర్డీఓ రాజాగౌడ్, ఆర్మూర్ ఏసీపీ జి.బస్వారెడ్డి, ఏ.సీ.పీ విష్ణుమూర్తి, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## అనుమానాస్పద లావాదేవీలను గుర్తించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

అనుమానాస్పద లావాదేవీలను బ్యాంకర్లు గుర్తించాలన్నారు, ఎన్నికల అధికారి, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మంగళవారం నాడు, కలెక్టర్ కార్యాలయ మినీ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లాస్థాయిలో బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాభై వేల నుంచి పది లక్షల మధ్య డబ్బుల లావాదేవీలు జరిగితే కచ్చితంగా రసీదు ఉండాలని పేర్కొన్నారు. 10,లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. జిల్లాలో ఏటీఎంల్లో డబ్బులు నింపేందుకు వచ్చే సెక్యూరిటీ వ్యాన్ లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఏజెన్సీలు పెద్ద మొత్తంలో డబ్బులు తరలించాలంటే తెలంగాణ సీఈఓ నుంచి అనుమతి తప్పనిసరిగా పొందాలని అన్నారు. లాకర్స్ లో గోల్డ్ ను పర్యవేక్షించి, క్యాష్ జెనరేట్ చేయడానికి క్యూఆర్ కోడ్ ను ఉపయోగించాలని, వెహికిల్ నంబర్ లను తనిఖీ చేయాలని వివరించారు. అలాగే ప్రతి రోజూ క్యాష్ డిపాజిట్ వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో లతో జిల్లా ఎన్నికల అధికారి, అద్వైత్ కుమార్ సింగ్ పోస్టల్ బ్యాలెట్, హెూం ఓటింగ్, ఎన్నికల విధులలో వివిధ ఎమర్జెన్సీ డిపార్ట్మెంట్ల ప్రాముఖ్యత తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్ రాము, తో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, అడిషనల్ ఎస్పీ చెన్నయ్య, ఎల్డీఎం ఆర్. సత్యనారాయణ మూర్తి ,బ్యాంకర్లు, ఎలక్షన్ సూపరిడెంట్ పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారు

### ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కవిత రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



భూమి, ఆకాశం సముద్ర గర్భంలో అన్నిరంగాలలో నేడు పురుషులతో సమానంగా మహిళలు పోటీ పడుతున్నారని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కవితా రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రగతి నగర్ ఉషోదయ మహిళా డిగ్రీ కాలేజీలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ కవితా రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఇంటికే పరిమితం కాకుండా సమాజంలో జరుగుతున్న అన్ని విషయాలు తెలుసుకోవాలని, తన కాళ్లపై తాను నిలబడి శారీరకంగా, మానసికంగా దృఢంగా, ధైర్యంగా మహిళలు ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నర్రా రామారావు మాట్లాడుతూ ఓటు హక్కును మహిళలు వినియోగించుకోవాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన చేసుకుని ముందుకు వెళ్లాలని, అప్పుడే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని ఆయన అన్నారు. చదువు అంటే మూడో కన్ను అని, చదువుకుంటే విజ్ఞానం పెరుగుతుందని, మంచి - చెడులు తెలుస్తాయని, ప్రతీది ప్రశ్నించాలని జె వి వి జాతీయ నాయకులు డాక్టర్ రామ్మోహన్రావు అన్నారు. శాస్త్రీయంగా ఆలోచిస్తూ మూఢ విశ్వాసాలను నమ్మకుండా మహిళలు ముందుకెళ్లాలని కోయెడి నర్సింలు అన్నారు. అనంతరం ముఖ్యవక్తులుగా హాజరైన డాక్టర్ కవితరెడ్డిని, డాక్టర్ రామ్మోహన్ రావు లను సన్మానించారు. కళాకారులు సిర్పాలింగం బృందం పాటలు ఆలపించారు. ఉషోదయ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర వీఆర్వో ప్రమోద్, శ్రీనివాస్, సిర్పలింగం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

TIMES OF VARTHA (20-03-24)_times of varha main (13-2).qxd 3/20/2024 5:28 AM Page 3



# మహిళలకు మాత్రమే సమాజ గమనాన్ని మార్చే శక్తి

**ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్**

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:

మహిళలు చాలా శక్తివంతులని సమాజ గమనాన్ని మార్చే శక్తి వారికి మాత్రమే ఉంటుందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చాత రాజు దుర్గ ప్రసాద్ తెలిపారు. పట్టణంలోని శ్రీపతి నగర్ లో వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ ఆఫ్ మంచిర్యాల సఖి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళ వారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర చాలా కీలకమని, వారు ఆర్థికంగా ఎదిగినప్పుడే అది సాధ్యమ వుతుందని తెలిపారు. మహిళలు వృత్తి శిక్షణలో శిక్షణ ద్వారా నైపుణ్యాలు పెంచుకోవడం వల్ల వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వం ద్వారా వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వయోజన విద్యాశాఖ అధికారి పురు షోత్తం నాయక్ మాట్లాడుతూ, ప్రతి ఒక్క శిక్షకురాలు కనీసం 5గురు చదువురాని వయోజనులకు అక్షరాలు నేర్పించాలని సూచించారు. విద్యకు వయస్సుతో సంబంధం లేదని సులభ పద్ధతిలో వారికి చదువు చెప్పాలన్నారు. జ్ఞానాన్ని ఇతరులకు పంచితే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్పి కొండపల్లి అశోక్ రావు,శిక్షణ కేంద్రం



కోఆర్డినేటర్ ఉప్పులేటి గోపిక, ట్రైనర్ యు శారద, ఉప్పులేటి నరేష్, రామసాని శేఖర్, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షా కేంద్రాలను సందర్శించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



టైమ్స్ ఆఫ్ వార్త - మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి

పదవ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాలను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంటిసేరి హై స్కూల్, మరియు చైతన్య టెక్ స్కూల్ లో పరీక్ష కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు పరీక్షలు సజావుగా జరిగేందుకు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఎస్పీ పర్యవేక్షంచారు. పరీక్షలను పురస్కరించుకొని పరీక్షలు జరుగుతున్న పరీక్షా కేంద్రాల పరిసరాలపై పోలీసులతో పాటు, ఇన్విజిలెటర్లు దృష్టి పెట్టాలని, సెక్షన్ 144 అమలు లో ఉన్నందున పరీక్షా కేంద్రాల పరిసరాల్లో ప్రజలు గుంపులు ఉండకుండా జాగ్రత్త పడాలని అలాగే అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించడం చేయరాదని, ముఖ్యం పరీక్షలు జరుగుతున్న సమయంలో పరీక్షా కేంద్రాల పరిసరాలను నో సెల్ ఫోన్ జోన్ గా పరిగణలోనికి తీసుకుపోవడంతో పాటు పరీక్షా కేంద్రం పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసి వేయాలని, ముఖ్యంగా సిసి కెమెరాల పనితీరుపై సంబందిత పరీక్షా కేంద్రం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేశించాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ తెలిపారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల పై కేసు నమోదు

**పలుమార్లు కేసులు చేస్తున్న మారని టాక్టర్ యజమానులు**



టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి

తిరుమలగిరి మండల కేంద్రంలో ఉదయం 07.00 గంటలకు, ఆక్రమంగా ఎలాంటి అనుమ తులు లేకుండా తమ ట్రాక్టర్లతో బండకొత్తపల్లి నుండి తిరుమలగిరికి ఒకరు, వేరొకరు తిరుమలగిరి నుండి వెలిశాలకు ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్ లను పట్టుబడి చేసి కేసులు నమోదు చేయనైనది. ఎవరైనా సంబందిత అధికారుల అనుమతి లేకుండ ఇసుక రవా ణా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడును అని తిరుమలగిరి ఎస్ఐ హెచ్చరించారు

# అంత్యక్రియలకు ఆర్థిక సహాయం..



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బాబయ్య-పోచమ్మ ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై సోమవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్ లోని నిజాంసాగర్ కాలువలో ఒకరినొకరు తాడుకట్టుకొని దూకి ఆత్మ హత్య చేసుకున్నారు. నిరుపేద దంపతుల ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ వారి అంత్యక్రియలు నిర్వహించడం కోసం బోధన్ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్ రూ.5000లను తన వంతుగా ఆర్థిక సహాయాన్ని భాధిత కుటుంబ సభ్యులకు అందించి తన ఉదారతను చాటుకున్నారు.

# కొండగట్టు అంజన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే వివేక్

**ఎమ్మెల్యేతో కలిసి పూజలో పాల్గొన్న బండి సదానందం యాదవ్**

టైమ్స్ ఆఫ్ వార్త - మందమర్రి



ప్రసిద్ధి పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న జగిత్యాల జిల్లాలోని కొండగట్టు ఆంజనేయ స్వామిని మంగళవారం చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి, ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహించారు. కాగా చెన్నూరు ఎమ్మెల్యేగా డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి గెలిస్తే స్వామి వారికి 101కొబ్బరికాయలు చెల్లిస్తామని వర్మ నవీన్ అనే కార్యకర్త స్వామి వారికి ముక్కుకోగా, కార్యకర్త మొక్కును ఎమ్మెల్యే వివేక్ స్వామి వారికి చెల్లించారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు బండి సదానందం యాదవ్ సైతం ఎమ్మెల్యే తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఐదు క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

**ఆటోను సీజ్ చేసిన తిరుమలగిరి ఎస్సై**

టైమ్స్ ఆఫ్ వార్త - సూర్యాపేట జిల్లా ప్రతినిధి



తిరుమలగిరి మండల కేంద్రంలో ఉదయం కన్నారెడ్డికుంట తండా, చుట్టుప్రక్కల తండాల ప్రజలనుండి మోసపూరిత మాటలు చెప్పి తక్కువ ధరకు ప్రభుత్వం పేద ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యమును కొనుగోలు చేసి ఎక్కువ దరకు కోళ్ళ పారంలకి అమ్ముటకు తరలిస్తున్న వ్యక్తులను పట్టుబడి చేసి వారి వద్దనుండి 13 బస్తాలు అంధాజ 5 క్వింటాల రేషన్ బియ్యం తరలించడానికి ఉపయోగించిన ఆటొను సీజ్ చేయనైయనది అని తిరుమలగిరి ఎస్సై తెలియజేశారు.

# మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం కృషి చేయాలి

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు**

టైమ్స్ ఆఫ్ వార్త - జాజిరెడ్డిగూడెం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు.మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సాయుధ పోరాట యోధురాలు భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం సాగిన మహోన్నతమైన పోరాటంలో 13 సంవత్సరాల చిన్న వయస్సులోనే తుపాకులు చేతబట్టి నైజం సర్కారులను గడగడలాడించిన వీర వనిత అని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జే శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు నిమ్మనగోటి



అబ్బులు,కొమ్ము విజయ్ కుమార్,దేవరకొండ వెంకన్న, యాదగిరి జమలకుంట్ల కృష్ణయ్య,వజ్జె సైదయ్య,కొప్పోజు యాదగిరి, దేవరకొండ బాలయ్య, ఈదుల వీర పాపయ్య, పగిడిమర్రి శేఖర్,శ్రీనివాస్,వెంకన్న,రవి, అంకిరెడ్డి వెంకులు, మిరియాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర వైద్యం అందించడానికి శిక్షణ



టైమ్స్ అఫ్ వార్త, మందమర్రి:

అత్యవసర సమయంలో రోగికి అందించాల్సిన వైద్యం గురించి అవగాహన కల్పించడం కొరకు వైద్య సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రి అడిషనల్ సీఎంవో డాక్టర్ ఉషా తెలిపారు. మంగళవారం ఆసుపత్రి ప్రాంగణంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ (బిఎల్ఎస్),అక్యూట్ కారోనరీ సింద్రోమ్ అరెస్ట్ రిథమ్స్ అండ్ అడ్వాన్సడ్ ట్రూమ లైఫ్ సపోర్ట్ (ఏసిఎల్ఎస్) అంశాలపై హైదరాబాద్ ఈఎంఆర్ఐ, జీవీకే ఫౌండేషన్ డాక్టర్లచే వైద్య సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ శిక్షణ తరగతులు మంగళవారం నుండి మొదలుకొని శుక్రవారం వరకు 4రోజులపాటు బెల్లంపల్లి రీజియన్ లోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి, ఎస్టిపిపి డాక్టర్లకు, స్టాఫ్ నర్సులకు, వార్డ్ బాయ్స్ లకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయవాణి, ఏఐటీయూసి నాయకులు ఎండి అక్బర్ అలీ, ఆంజనేయులు, ఆసుపత్రి ఫిట్ కార్యదర్శి నాగేంద్ర భట్, డాక్టర్ ప్రసన్న, డాక్టర్ జావేద్, ఈఎంఆర్ఐ, జీవీకే డాక్టర్ రవి, ఈఎంఆర్ఐ, జీవీకే సంక్షేమ అధికారి జీదుల శ్రీనివాస్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై స్పందించిన మున్సిపల్ కమిషనర్

**హర్షం వ్యక్తం చేసిన ప్రజలు**

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:

పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్లో గత కొన్ని నెలలుగా మురికి కాలువలలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో బస్తీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ యువ నాయకుడు ఎండి జావిద్ ఖాన్ పట్టణ మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకు వెళ్లగా, స్పందించిన ఆయన, పరిసరాలను సందర్శించి, మున్సిపల్ సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం మున్సిపల్ సిబ్బంది గాంధీనగర్లోని మురికి కాలువల లోని పూడికతీత పనులు నిర్వహించి, రోడ్డుకు ఇరు వైపుల ఉన్న పిచ్చి మొక్కలు తొలగించడం తోపాటు ఏరియాలోని చెత్తకుప్పలను సైతం శుభ్రం



చేశారు.సమస్యలపై తక్షణమే స్పందించి, వాటిని పరిష్కరించిన మున్సిపల్ కమిషనర్ కు ఏరియా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలిపారు.

# ఆగ్రోస్ చైర్మన్ ను సత్కరించిన జర్నలిస్టులు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసుల బాలరాజ్ రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్గా నియమితులైన సందర్భంగా మంగళవారం కోటగిరి మండలం మున్నూరు కాపు సంఘం ప్రతినిధులు, జర్నలిస్టులు, ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కొట్టం మనోహర్, కొప్పుల గంగాధర్, జర్నలిస్టులు తెల్ల రవికుమార్, సుదీప్, పెద్దకాపు శ్రీకాంత్, ఎం. ఆనంద్ పటేల్ ,బర్ల అర్పిత్, దత్తు , తదితరులు, పాల్గొన్నారు.

# వాడి వేడిగా సర్వసభ్య సమావేశం

**సమయ పాలన పాటించని ఉపాధ్యాయులు**

**ఎంఈఓ ను నిలదీసిన ఎంపిటిసి బీరయ్య**

టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్

మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా సాగింది. మంగళవారం ఎం.పి.పి గైని అనుసూయ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సదాశివనగర్ ఎంపిటిసి బీరయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించడం లేదని మండల విద్యాశాఖ అదికారి యొసెఫ్ ను నిలదీశారు. ప్రభుత్వ పాఠశాల విద్య పై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. సదాశివనగర్ ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా 11-00 గంటల వరకు ఒక ఉపాధ్యాయుడు రాలేదని ఎం.ఈ.ఓ ను ప్రశ్నించారు. చెప్పింది వాస్తవమేనని సభలో ఎంఈఓ ఒప్పుకున్నారు. గృహ జ్యోతి లో పాత బకాయిలు తప్పకుండా చెల్లించాలని సదాశివనగర్ విద్యుత్ ఏ.ఈ దర్మారెడ్డి తెలిపారు. సదాశివనగర్ లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇండ్ల



నిర్మాణాలు చేపడుతున్నారని దేవాలయ భూములలో కూడ ఇండ్లు నిర్మించారని తెలిపారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎం.పి.పి గాదారి శ్రీనివాస్ రెడ్డి, జడ్పీ టిసి కమిలి నర్సింలు, జడ్పీ కొ అప్షన్ మెంబర్ మోహినోద్దిన్, తహశీల్దార్ గంగా సాగర్, ఎంపిడిఓ సంతోష్ కుమార్ ప్రత్యేక అధికారులు, ఎం.పి.టి.సిలు తదితరులు పాల్గొన్నారు

జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం,
20-03-2024


## గురుకులాల్లో రెగ్యులర్ బ్యాక్ లాక్ భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

టైమ్స్ ఆఫ్ వార్త - మెండోరా

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుచున్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులలో తెలంగాణ గిరిజన గురుకులాల్లో విద్యా సంవత్సరానికి గాను రెగ్యులర్ 6, 7, 8, 9 తరగతిలో బ్యాక్లాగ్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికల పోచంపాడు ప్రధాన ఆచార్యులు శ్రీ జి సుదర్శన్ గారు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తేదీ 4-3.2024 నుండి 23-3-2924 వరకు సమీప మీ సేవలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రవేశ పరీక్ష 21బి4బి2924 ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు పరీక్ష ఉంటుందని తెలియజేసినారు.

## మంత్రులను మర్యాదపూర్వకంగా కలిసిన మానాల మోహన్ రెడ్డి

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల యూనియన్ లిమిటెడ్ చైర్మన్ గా నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిని నియమించిన సందర్భంగా ఆయన హైదరాబాద్ లో సహకార సంఘాల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అదే విధంగా మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని, ప్రభుత్వ సలహాదారులు నరేందర్ రెడ్డిని, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు పిసిసి ప్రధాన కార్యదర్శులు గడుగు గంగాధర్, నగేష్ రెడ్డి, జిల్లా ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వేణు రాజ్, నాగేంద్ర, మహేష్, నిఖిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మోడీని కలిసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నా

**ఎంపీ అరవింద్, పార్టీ అధ్యక్షుడు దినేష్ కు కృతజ్ఞతలు తెలిపిన వినోద్ రెడ్డి**

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



భారత ప్రధాని నరేంద్ర మోడీని సమీపంగా కలిసే అవకాశం దొరకడం అదృష్టంగా భావిస్తున్నానని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ నాయకుడు వినోద్ రెడ్డి అన్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో జరిగిన విజయ సంకల్ప సభలో విశ్వ గురువు, భారత ప్రధాని, ప్రపంచ దేశాలకి వెన్నుముకగా నరేంద్ర మోడీని కలిసిన సందర్భంగా రూరల్ నియోజకవర్గ యువ నాయకుడు వినోద్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశాన్ని కల్పించిన నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ కు, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## బెల్ట్ దుకాణం పై టాస్క్ ఫోర్స్ దాడి



టైమ్స్ ఆఫ్ వార్త - మాక్లూర్



మాక్లూర్ మండలం కొత్తపల్లి గ్రామలో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ వ్యక్తి బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడు . మంగళవారం టాస్క్ ఫోర్స్ అధికారులు ఆ బెల్ట్ షాప్ పై మెరుపు దాడి నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో సీఐ అంజయ్య, సిబ్బంది లక్ష్మన్న, సుదర్శన్, రాములు,అనిల్ కుమార్, లు బెల్ట్ షాప్ పై దాడి చేశారు. ఈ దాడిలో బెల్ట్ షాప్ లో 123.250 లీటర్లు అనగా 30,210 రూపాయల విలువగలది లిక్కర్‌ను టాస్క్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే మాక్లూర్ గుత్ప,గ్రామాలలో బెల్ట్ షాపుల పై దాడిచేసి, 47.450 లీటర్లు. దీనివిలువ 11,580 రూపాయలు విలువ గలది స్వాదిన పరుచుకున్నారు. తదుపరి చర్యనిమిత్తం మాక్లూర్ పోలిస్టేషన్ ఎస్ హెచ్ ఓ కి అప్పజెప్పామని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

# అక్రమాలకు పాల్పడుతున్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోండి

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:



జిల్లాలో పౌర సరఫరాల శాఖలో అక్రమాలకు పాల్పడుతున్న శాఖ డిఎం గోపాల్, సీనియర్ అసిస్టెంట్ మహిపాల్ లపై విచారణ జరిపి, కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన రక్షణ సమితి (బిఆర్ఎస్) జిల్లా అధ్యక్షుడు ముల్కల రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రభుత్వ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పౌర సరఫరా శాఖలో డిఎం గోపాల్, సీనియర్ అసిస్టెంట్ మహిపాల్ లు గత ఏడు సంవత్సరాలు నుండి ఇదే శాఖలో పని చేస్తూ, చాలా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. 2019 సంవత్సరంలో కోవిడ్ మహమ్మారి విజృంభిస్తున్న సమయంలో జిల్లాలోని పాఠశాలలకు, హాస్టల్ విద్యార్థులకు పంపవలసిన మధ్యాహ్న భోజనం పథకానికి సంబంధించిన ఎండిఎం సన్నారకం బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయగా ఆ బియ్యాన్ని రేషన్ షాపులకు సరఫరా చేయకుండా, అక్రమంగా నిల్వ ఉంచారని ఆరోపించారు. అదేవిధంగా కరోన నేపథ్యంలో ఆబియ్యాన్ని తెల్ల రేషన్ కార్డుదారులకు అందజేయాల్సిందిగా ప్రభుత్వ ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వారు రేషన్ షాపులో గానీ, తెల్ల రేషన్ కార్డుదారులకు కానీ ఇవ్వకుండా, బియ్యాన్ని నిల్వ ఉంచి, రైస్ మిల్లర్లకు బ్లాక్ మార్కెట్లో అధిక ధరకు అమ్ముకొని, కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించి, ప్రభుత్వ, ప్రజల ధనాన్ని అక్రమంగా దోచుకున్నారన్నారు. ఆబియ్యానికి సంబంధించి మంచిర్యాల పరిధిలో 769.09 క్వింటాల్లు, లక్షెటిపేట్ పరిధిలో 775.63 క్వింటాల్లు, తాండూర్ పరిధిలో 52 క్వింటాల్లు, బెల్లంపల్లి పరిధిలో 286.80 క్వింటాల్లు, కోటపల్లి పరిధిలో 26 క్వింటాల్లు, చెన్నూరు పరిధిలో 315 క్వింటాల్లు,మొత్తం 2226.57క్వింటాల్ల బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారని గణాంకాలతో సహా తెలిపారు. దీనికి గాను అప్పటి జిల్లా కలెక్టర్ వీరి ఇరువురిని సస్పెండ్ చేయగా,ఆ సమయంలో వారు ప్రభుత్వంలో అధికారంలో ఉన్న నాయకుల పైరవీలతో నిజామాబాద్ జిల్లాలో పోస్టింగ్ తెచ్చుకున్నారని.అనంతరం వీరిని సస్పెండ్ చేసిన కలెక్టర్ బదిలీ అయిన అనంతరం వీరు మరలా పైరవీతో జిల్లాకు పోస్టింగ్ తెచ్చుకున్నారన్నారు. జిల్లాకు వచ్చేలా వచ్చి జిల్లాకు వచ్చిన అనంతరం వారు గోదాం ఇంచార్జ్ లను బెదిరించి, ఆ సమయంలో నిల్వ ఉంచిన 2226.57క్వింటాళ్ల బియ్యాన్ని రైస్ మిల్లుర్లకు అక్రమంగా బ్లాక్ మార్కెట్లో అమ్ముకొని, సుమారు 10 కోట్ల రూపాయల అక్రమ సంపాదన ఆర్జించారని వివరించారు.వారి అక్రమాలు ఇవే కాకుండా పిడిఎస్ బియ్యం సరఫరా చేయడానికి రైస్ మిల్లర్లకు కొత్త గోనె సంచులు ఇవ్వాల్సి ఉండగా, వారికి పాత గోనె సంచులు ఇచ్చి, సుమారు మూడు కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారని తెలిపారు.రైస్ మిల్లర్ల వద్ద బియ్యం పాస్ చేయడానికి ఒక్కో రైస్ మిల్లా ఎస్కే ఇవ్వడానికి ఒక్క ఎస్కే కు 5వేల రూపాయల చొప్పున నెలకు రెండు కోట్ల రూపాయలు రైస్ మిల్లర్ల నుండి వసూల్ చేస్తున్నారన్నారు.ప్రజా పంపిణీ కి పిడిఎస్ బియ్యం నూకల బియ్యాన్ని పంపించి, మంచి రకం పిడిఎస్ బియ్యాన్ని సైతం అక్రమంగా తరలించారని ఆరోపించారు. అదేవిధంగా స్టేజ్ 1 కాంట్రాక్టర్లకు చెందిన బిల్లులు సైతం ఇవ్వకుండా, లంచాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. పౌరసరఫరాల శాఖలో ఇంత అక్రమాలకు పాడుతున్న డిఎం గోపాల్, సీనియర్ అసిస్టెంట్ మహిపాల్ పై ఏసీబీ,విజిలెన్స్ ల ద్వారా సమగ్ర విచారణ జరిపి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,ప్రజలకు పంపిణీ చేయవలసిన పిడిఎస్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయించగలరని కోరారు.

# అధికారుల సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలి

**సిఎంఓఏఐ ఆధ్వర్యంలో ఏరియా జిఎం కు వినతిపత్రం**

**సిఎంఓఏఐ ఏరియా అధ్యక్షుడు రమేష్**

టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:




సింగరేణి ఏరియాలో గత శనివారం జరిగిన ప్రమాదంలో జనరల్ మజ్దూర్ కార్మికుడు కర్రె రాజు మృతి చెందిన సంఘటనపై విచారణ జరుగుతుండగానే సింగరేణి యాజమాన్యం ఏరియాలో ఇద్దరు అధికారులపై చార్జ్ షీట్, సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేయడం తగదని, వెంటనే ఆ ఉత్తర్వులు రద్దు చేయాలని కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సిఎంఓఏఐ) ఏరియా అధ్యక్షుడు ఎస్ రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏరియా జిఎం ఏ మనోహర్ కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏరియాలో శనివారం జరిగిన ప్రమాదంలో జనరల్ మజ్దూర్ కార్మికుడు కర్రె రాజు మరణించడం బాధాకరమని, ఆ సంఘటనపై సంఘం తరపున విచారణ వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ సంఘటనపై డిఎంఎస్ అధికారుల విచారణ పురోగతిలో ఉన్నందున, మొత్తం వాస్తవాలు బయటికి రానప్పుడు, ఇద్దరు అధికారులను సింగరేణి యాజమాన్యం వెంటనే సస్పెన్షన్ లో ఉంచాలని నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. ప్రతిరోజు ఉత్పత్తి, రక్షణలో ముందు ఉండి నడిపించే అధికారులపై ఈవిధంగా చర్యలు తీసుకోవడం మూలాన వారి మనోభావాలు దెబ్బతీసినట్టుగా అవుతుందని తెలిపారు. అధికారులకు ఇచ్చిన చార్జ్ షీట్, సస్పెన్షన్ ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఈమేరకు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియా జిఎంలతో సింగరేణి సిఎండి బలరాంకు వినతిపత్రం పంపించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం ఏ రాజేశ్వర్ రెడ్డి,ఐఈడి డిజిఎం రాజన్న, కేకే ఓసిపి ప్రాజెక్ట్ అధికారి రమేష్, శాంతిఖని గ్రూప్ ఏజెంట్ విజయప్రసాద్, సిఎంఓఏఐ ఏరియా కార్యదర్శి పైడీశ్వర్, సిఎంఓఏఐ అధికారులు, ఏరియా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయం..

టైమ్స్ ఆఫ్ వార్త - బోధన్



తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేయడంతో రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు బోధన్ పట్టణంలోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం అసోసియేషన్ భవనంలో బోధన్ డివిజన్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల లోపే కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు.రెడ్డి కులస్తులలో కూడా 30శాతం మంది నిరుపేదలున్నారని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని కొనియాడారు. గత ప్రభుత్వం ప్రకటనలకు మాత్రమే పరిమితం చేసింది గాని అమలు చేయడంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహారించిందని మండిపడ్డారు. ఈ కార్పోరేషన్ వల్ల నిరుపేదల కుటుంబాలలో చదువుకోలేని వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. గత ప్రభుత్వంలో రెడ్డిలను రాజకీయాలలో ఎదగనివ్వకుండా అణిచివేశారని మండిపడ్డారు. రాబోయే రోజుల్లో బోధన్ నియోజకవర్గంలో రెడ్డి సంఘ భవనం ఏర్పాటు నిరుపేదలకు సహాయం చేస్తామన్నారు. రెడ్డి కులస్థులకు ఆర్థికంగా తోడ్పాటును అందించేందుకు రెడ్డి కార్పోరేషన్ ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మంత్రి వర్గ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిర్మల్ రెడ్డి,కౌన్సిలర్ శరత్ రెడ్డి,గోపాల్ రెడ్డి,విట్టల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,సంజీవ్ రెడ్డి,రవీందర్ రెడ్డి,నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షానికి నేలకొరిగిన మొక్కజొన్న పంటను పరిశీలించిన ఏ.వో

టైమ్స్ ఆఫ్ వార్త - సదాశివనగర్



ఇటీవల కురిసిన అకాల వర్షానికి నెలకొరిగిన మొక్కజొన్న పంటను మంగళవారం మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి పరిశీలించారు. మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన ఏనుగు కృష్ణారెడ్డి అనే రైతు మొక్కజొన్న పంటను రైతులతో కలిసి పరిశీలించారు. చేతికి వచ్చే దశలో అకాల వర్షాలకు పంటలు దెబ్బ తిని రైతులు తీవ్రంగా నష్టపోయారని రైతులు తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి పంట సాగు చేస్తున్న రైతుల పాలిట ఈ వర్షాలు శాపంగా మారాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. నష్టపోయిన పంటల వివరాలు ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఏవో తెలిపారు

## బేటీ బచావో బేటీ పడావో పై అవగాహన..

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్




మహిళా,శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం పరిధిలో బేటి బచావో బేటి పడావో పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బోధన్ పట్టణంలోని డిగ్రీ కళాశాలలోని విద్యార్థినిలకు, ఎన్ఎస్ఎస్ వాలంటరీస్ లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మహిళా సాధికారత కేంద్ర జిల్లా మిషన్ సమన్వయకర్త పి.స్వప్న బాలిక లింగ నిష్పత్తి పెంచేందుకు, బాల్య వివాహాలను అరికట్టడానికి ఉన్న మార్గాలను తెలియజేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటరీస్‌గా గ్రామాలలో ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం సిడిపిఓ జానకమ్మ మాట్లాడుతూ ఐసిడిఎస్ సర్వీసెస్ ఆడపిల్లల విద్యా ప్రాముఖ్యతను గురించి, చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ రాధిక, చైర్మన్ డిహెచ్ఈడబ్ల్యూ ఎస్ ఎఫ్ ఎల్ పుష్ప, అంగన్వాడి టీచర్స్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థిక సహాయం..

టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బాబయ్య-పోచమ్మ ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్థాపానికి గురై సోమవారం జిల్లా కేంద్రంలోని న్యూస్రత్నగర్ లోని నిజాంసాగర్ కాలువలో ఒకరినొకరు తాడుకట్టుకొని దూకి ఆత్మహత్య చేసుకున్నారు. నిరుపేద దంపతుల ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ వారి అంత్యక్రియలు నిర్వహించడం కోసం బోధన్ మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సిర్ప సుదర్శన్ 5000 రూపాయలను తన వంతుగా ఆర్థిక సహాయాన్ని భాధిత కుటుంబ సభ్యులకు అందించి తన ఉదారతను చాటుకున్నారు.



జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
బుధవారం, 20-03-2024


# రోడ్డెక్కిన రైతన్న...



జాతీయ రహదారిని దిగ్బందించిన రైతులు

హైవే పైన కిలోమీటర్ల మేర

నిలిచిపోయిన రాకపోకలు

నష్టపరిహారం చెల్లించ దాకా కదిలేది

లేదంటున్న రైతులు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



టైమ్స్ ఆఫ్ వార్త - భిక్కనూర్

అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులు రోడెక్కారు. నష్టపరిహారం చెల్లించాలని నిరసన తెలుపుతూ 44 జాతీయ రహదారిని దిగ్బందించారు. హైవే పైన కిలోమీటర్ల రాక పోకలు నిలిచిపోయాయి. భిక్కనూరు మండలంలోని వివిధ గ్రామాల వందలాది మంది రైతులు రోడ్డుపై బైఠాయించారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానా 50 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అక్కడికి పోలీసులు చేరుకొని రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. . రైతులు హామీ ఇచ్చేవరకు కదిలేది లేదంటున్నరు. వ్యవసాయ అధికారులు అక్కడికి చేరు కొని నష్టపోయిన రైతుల పంటలను అంచనా వేసి ప్రభు త్వానికి నివేదిక అందజేస్తామన్నారు. లక్షలాది రూపా యలు అప్పులు చేసి పంట సాగు చేస్తే ఇటీవల కురిసిన వర్షానికి పంటలు నెలమట్టమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభు త్వం తక్షణమే ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు. కామా రెడ్డి ఆర్ డి ఓ శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడిఏ అపర్ణ, ఏవో రాధా ,ఎమ్మార్వో శివప్రసాద్, కామారెడ్డి డిఎస్పి నాగేశ్వ రరావు, బిక్కనూర్ , కామారెడ్డి సిఐలు సంపత్ కుమార్, చంద్రశేఖర్, భిక్కనూర్ ఎస్సై సాయికుమార్ పాల్గొన్నారు

# మాడవీధులలో సూర్యప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ వేంకటేశ్వర స్వామి

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

"శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి" వారి "నవమ వార్షిక బ్రహ్మోత్సవాలలో" భాగంగా ఈరోజు "తెలంగాణ తిరుమల దేవస్థానం" (టీటీడీ) బీర్కూరు (తిమ్మాపూర్), " లో జరిగిన పూజా కార్యక్రమాలు, రథోత్సవం లలో కుటుంబ సభ్యులు, పాలకమండలి సభ్యులు, భక్తులతో కలిసి పాల్గొన్న ఆలయ ధర్మకర్త, మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యులు, పోచారం శ్రీనివాస రెడ్డి-పుష్ప దంప తులు. ఉదయం మాడ వీధులలో సూర్యప్రభ వాహనంపై స్వామి వారి ఊరేగింపు, సాయ ంత్రం మాడ వీధులలో చంద్రప్రభ వాహనంపై జరిగిన స్వామి వారి ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పోచారం ప్రేమల- శంభు రెడ్డి తో పాటు పాలకమండలి ప్రతినిధులు, అమ్మ స్వాములు, భక్తులు, తదితరులు, భారీ సంఖ్యలో హాజరై శ్రీ వేంక టేశ్వర స్వామి కృపకు పాత్రులయ్యారు.



# నా పార్టీ అనుకున్న నీకెవరు తోడుగా ఉంటారు

కండువ వేసుకుని మురిసిన నీకు జరిగే అవమానలకు నీ

అంతరాత్మ ప్రత్యక్ష సాక్షి..

సెల్ఫీల కోసం ముందుడే 10 జిరాక్స్ కాపీలా కంటే

100 ఓట్లు తీసుకొచ్చే వాడే గొప్ప...

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:

వస్తున్నాయి ఎన్నికలంటే ముందుగా గుర్తొచ్చే వాడు కార్యకర్త బిర్యానీ ప్యాకెట్లు పంచలన్న, సీసాలు సప్లై చేయాలన్నే భుజం పై చేయి వేసి ముఖం లో కొంచం నవ్వుతిసుకొచ్చి నాయకుడు చెప్పే మాటలు విని దోస్తులతో దుష్మణులు చేసుకొని తన పార్టీ గెలుపు కోసం కష్ట పడే కార్యకర్త కు ఎ పార్టీ ఇస్తుంది 100 శాతం గౌరవం.ఓట్లు నాయకుడి ముఖం చూసి పడవు కార్యకర్త కష్టఫలితామే నాయకుని గెలుపు.జి హుజురి చేసే వాడికి బంగారు అబరణాలు తోఫా లో ఇస్తారు,వాస్తవాలు చెప్పేవాడిని అనగాదొక్కాలనే ప్రయత్నాలు చేస్తారు ఇదేమీ రాజకీయమో.పదవులకు డబ్బుకు ఆశ పడి నాయకులు పార్టీలు మార్చేస్తా ఉంటారు కానీ కార్యకర్తల పట్టిన జండాను వదలకుండా పార్టీ సిదాంతల కోసం పని చేస్తాడు.10 ఓట్లు వేయించలేని వాడు కూడా కద్దార్ బట్టలు వేసి బడా నాయకుడానిపించుకుంటాడు. ఫోటో ల కోసం సెల్ఫీ ఇచ్చేవారిని పార్టీ లో ప్రాథన్యత ఇవ్వడం కన్నా పార్టీ సిద్ధంతల కోసం పని చేసే నాయకుడు గొప్ప.

# రెండోరోజు జైతపూర్ ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్




టైమ్స్ ఆఫ్ వార్త - ఎడపల్లి

ఎడపల్లి మండలంలోని జైతపూర్ గ్రామాన్ని ట్రైనీ కలెక్టర్ కిరణ్మయి సందర్శించి పలు అంశాలపై అధ్యయనం చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని జడ్పీ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ను సందర్శించి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంను తనిఖీ చేశారు.అలాగే స్కూల్లోని టాయిలెట్స్ ను పరిశీలించి పరిశుభ్రత పాటించాలని సూచించారు.అలాగే విద్యార్థులతో ముచ్చ టిస్తూ విద్య, సౌకర్యాలపై ఆరా తీశారు.మెనుప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు.అనంతరం గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి ప్రజలకి అందిస్తున్న వైద్య సేవలపై ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు.అలాగే మహిళా సంఘాల ద్వారా ఉపాధి పొందుతున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వాలు మహిళా సంఘాలకు అందజేస్తున్న ఋణాలతో ఏవిధంగా స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారో తెలుసుకొని, రికార్డులు పరిశీలించారు.అలాగే మండల వ్యవసాయ అధికారి సిద్దిరామేశ్వర్ తో వ్యవసాయ సంబంధిత అంశాలపై, అలాగే రెవెన్యూ సంబంధిత అంశాలపై చర్చించారు. అంతేకాకుండా పంచాయతీ రాజ్ అంశాలపై ఎంపీడీఓ గోపాల కృష్ణ, ఎంపీఓ సుభాష్ చంద్రబోస్ లతో చర్చించి వివరాలు సేకరించారు.ఈ కార్యక్రమంలో అమెవెంట ఎంపిడిఓ గోపాలకృష్ణ, ఆర్ఐ వినోద్, సెక్రటరీ నాగేశ్వరరావు, కారోబార్ రహ్మతుల్లా విఓలు, ఉపాధి సిబ్బంది, డ్వాక్రా సిబ్బంది,తదితరులు ఉన్నారు.



# శేరిలింగంపల్లి కాంగ్రెస్‌లో భారీగా చేరికలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జగదీశ్వర్ గౌడ్..



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

కాంగ్రేస్ పార్టీలో చేరిన కొండాపూర్ డివిజన్ బిఆర్ఎస్ మహిళ నాయకురాళ్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ బాబా ఆధ్వర్యంలో కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్.. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్,టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ నల్ల సంజీవ రెడ్డి ,జాయింట్ సెక్రటరీ ఎం.తిరుపతి,రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వి.వీరేందర్ గౌడ్,ఉపాధ్యక్షులు పి.దినేష్ రాజ్,నాయకులు మనెపల్లి సాంబశివరావు,పల్లపు సురేందర్,వివేకానంద నగర్ డివిజన్ అధ్యక్షులు బాష్పక యాదగిరి,ప్రభాకర్,గోపాల్,నర్సింహ రాజు,కిరణ్,జగదీశ్,గోపాల్ నాయక మహిళలు అస్మా, రిజ్వాన, షేనాసా, సమీరా,సల్మా ,ఆశ బేగం,ఆసరా,తస్లీమ్,మీనా,సారా తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడు వెంకట్రావుకు 7 సంవత్సరాల గ్రాడ్యువీటి డబ్బులు ఇప్పించిన రవి సింగ్

నా జీవితం మొత్తం కార్మికులతోనే కార్మికులకు న్యాయం చేయడమే నా లక్ష్యం

బిఆర్ఎస్ కెవి రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాంధీనగర్ ఇండస్ట్రీ ఏరియాలో "శ్రీ సవిటర్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్" కంపెనీలో సిహెచ్ వెంకట్ రావు అనే కార్మికుడు గత ఏడు సంవత్సరాల నుంచి పనిచేసేవారు, కొన్ని అనివార్య కారణాలవల్ల కంపెనీ లో ఉద్యోగం మానేయడం జరిగింది... వెంకట్ రావు అనే కార్మికుడికి రావాల్సిన గ్రాడ్యువీటి ఇవ్వకపోవడంతో పలుమార్లు కంపెనీ యజమాన్యాన్ని అడిగి విసుగు చెందిన కార్మికుడు తనకు తెలిసిన వారి ద్వారా బిఆర్ఎస్ కెవి రాష్ట్ర కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవిసింగ్ గురించి తెలుసుకొని తన ఆఫీస్ వద్దకు వచ్చి తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు.. వెంటనే స్పందించిన కార్మిక నాయకుడు రవిసింగ్ హుటాహుటిన కంపెనీ వద్దకు బయలుదేరి కంపెనీ యజమాన్యంతో పలుమార్లు చర్చించి కార్మికుడికి రావలసిన ఏడు సంవత్సరాల గ్రాడ్యువీటి రూపాయలను ఇప్పించారు... కార్మికుడు మాట్లాడుతూ నాకు న్యాయం చేసిన కార్మిక నాయకుడు రవిసింగ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, సుదర్శన్, జగన్, ప్రేమ్,బాబు రావు,తదితరులు పాల్గొన్నారు..




# కార్మికులకు అండగా ఉంటా..

# తప్పు చేసే అధికారులను క్షమించడం లేదు

మున్సిపల్ కార్మికులు, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

ఆరోగ్యవంతమైన జీవితానికి పరిశుభ్రత ప్రాముఖ్యం

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా

పారిశుద్ధ వార్డ్ జోన్ - 1ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే ధన్పాల్



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని దుబ్బ, నాందేవాడ 36వ డివిజన్ లో ఉన్న జోన్ -1 పారిశుద్ధ వార్డ్ ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం 5 గంటలకు ఆయన ఆకస్మిక తనిఖీ చేసి పారిశుద్ధ కార్మికుల హాజరు రికార్డు, మున్సిపల్ బిల్స్ తదితర రికార్డ్స్ పరిశీలించారు. అనంతరం 43, 36 డివిజన్ లో పర్యటించి కార్మికుల పనితీరు, డ్రైనేజ్ చెత్త సేకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నాందేవాడ జోన్ -1 పారిశుద్ధ వార్డ్ లో మొత్తం కార్మికులు 180 పైన ఉన్నారని, ఈ రోజు 126 మంది హాజరు శాతం రికార్డ్స్ లో ఉందని తెలియజేసారు. మిగతా వార్డ్స్ కూడా త్వరలో తనిఖీ చేస్తానని, శానిటేషన్ విషయంలో కార్మికులు, అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలనీ, నగరంలో ఉన్న ప్రతి కాలనీ ని పరిశుభ్రంగా చేసే బాధ్యత మన పై ఉందని, ఆరోగ్యావంతమైన జీవితం గడపడానికి పరిశు భ్రత చాలా ప్రాముఖ్యం అని గుర్తు చేశారు. కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తప్పు చేసే అధికారులను క్షమించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు లక్ష్మీనారాయణ, శానిటేషన్ ఇన్స్పెక్టర్, వార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ ని కలవడం నా అదృష్టం.. ఎప్పటికి మరచిపోను..

121డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు..

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



బేగంపేట్ విమనాశ్రయంలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ని కలిసిన కూకట్ పల్లి 121- డివిజన్ అధ్యక్షులు అనంత నాగరాజు, 2024 సార్వత్రిక పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జగిత్యాల సభ ముగించుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణం అవుతుండగా బేగంపేట విమానాశ్రయంలో ప్రధాని మోడీ ని కలిసే అవకాశం లభించింది, అనంతరం నాగరాజు స్పందిస్తూ భారత ప్రధాని నరేంద్ర మోడీ ని కలవడం నా అదృష్టంగా భావిస్తూ, ఈ దేశం సురక్షితంగా సుభిక్షంగా ఉండాలంటే మోడీ ప్రభుత్వం 400 వందల పైచిలుకు మెజారిటీ కచ్చితంగా సాధించాలని వికసిత్ భారత్ లక్ష్యంగా దృఢ సంకల్పించిన నరేంద్ర మోడీ తో నేను ప్రయాణిస్తాను దేశం కోసం మోడీ! మోదీ కోసం నేను! నేను మోడీ కుటుంబం...

# డివిజి ట్రస్ట్ ద్వారా ఆడపడుచు వివాహానికి ఆర్థికసాయం

కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ లో నివాసముంటున్న నిరుపేద కుటుంబానికి చెందిన హామిల్వార్ సత్తి సావిత్రి దంపతుల కుమార్తె భవాని వివాహానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ డివిజి ట్రస్ట్ ద్వారా రూ.5000లు ఆర్థిక సహాయం అందించడం జరిగింది. కార్యక్రమంలో మల్లేష్, కేబుల్ సాయి, సత్తి తదితరులు పాల్గొన్నారు.





## అరుణోదయను నిషేధిత సంస్థగా అభివర్ణించిన

# సిరిసిల్ల ఎస్పీ వ్యాఖ్యలను ఖండించండి

**ప్రజా సంఘాల కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తేయాలని ఎస్పీ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మోహన్ బైరాగి, విమలక్క డిమాండ్**

టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి



అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఎసిఎఫ్) 1974లో ఏర్పడి 50 సంవత్సరాలుగా ప్రజల కోసం గళం విప్పి పనిచేస్తుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కీలకమైన పాత్ర పోషించి, ప్రజల మన్నన లు పొందుతుంటే సిరిసిల్ల ఎస్పీ అఖిల మహాజన్ దీనిని నిషేధిత సంస్థగా అభివర్ణించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య(ఎ సి ఎఫ్) అధ్యక్షురాలు విమలక్క ,తెలంగాణా రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ బైరాగి అన్నారు. మంగళవారం అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కార్యాలయం లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశం లో వారు మాట్లాడుతూ.. సిరిసిల్ల జిల్లాలో పోకల సాయికుమార్ అనే లా విద్యార్థితో పాటు, పురుషోత్తమరావు అనే అమాయకుల పై 2023 సెప్టెంబర్ లో తప్పుడు కేసులు నమోదు చేసిన గత ప్రభుత్వ చర్యలను తలకెత్తుకుని వారిద్దరిని అరెస్టు చేసిన సందర్భంగా ఎస్పీ అరుణోదయ పై ఇలాంటి తప్పుడు వ్యాఖ్యలు చేయడాన్ని నిరసించాలని ప్రజలకు, ప్రజా సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నాము. ప్రభుత్వ నిషేధిత సంస్థలో ఏ పార్టీలు, ప్రజా సంఘాలున్నాయో కూడా తెలియకుండా ఎస్పీ స్థాయి అధికారి ఇలా అబద్ధపు ప్రచారానికి పూనుకోవడం దుర్మార్గమని తెలిపారు. విప్లవ సంస్థలపై నిషేధం ఎత్తేయాలని ప్రజాస్వామిక వాదులు కోరుకుంటున్న స్థితి రోజు, రోజుకు పెరుగుతుంది. కేంద్రంలో ఫాసిస్టు పోగడాలకు వ్యతిరేకంగా పాలక ప్రతిపక్షాలను ఏకం చేస్తున్నామంటున్నా కాంగ్రెస్ పాలకులు ఇలాంటి పోలీసు అధికారుల అసంబద్ధ వ్యాఖ్యలపై స్పందించాలని కోరుతున్నాము. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని అణచడానికి సమైక్యాంధ్ర పాలకులు అరుణోదయ పై కక్ష గట్టి తప్పుడు కేసులు మోపారు. తెలంగాణ రాష్ట్ర సాధన తర్వాత అదే వరుసలో టిఆర్ఎస్ ప్రభుత్వం కూడా అరుణోదయ కార్యకర్తలపై కక్ష గట్టి, డిసెంబర్ 2, 2016 నాడు మా కార్యాలయం పై చట్టవిరుద్ధంగా దాడి చేసి అక్రమంగా తాళాలు వేశారు. 8 నెలల పాటు మమ్మల్ని వేధించినందుకు ప్రజల వ్యతిరేకతను చవిచూశారు. అలాగే 2022 ములుగు జిల్లా తాడ్వాయి మండలం, బీరెల్లి కుట్ర కేసు(క్రైం నంబర్ 152/2022)లో కూడా అరుణోదయ నాయకత్వం పై ఊపా కేసు పెట్టడం జరిగిందన్నారు .కావున ఇలాంటివి సరిదిద్ది ప్రజాపాలన అందిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం లోని అధికారియే అరుణోదయ పై ఇలాంటి అబద్ధపు ప్రచారాలు చేయడానికి ఖండిస్తూ, అరుణోదయతో పాటు ప్రజా సంఘల కార్యకర్తలపై అక్రమ కేసులు ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నాంమని ఎస్పీ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని మోహన్ బైరాగి విమలక్క డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రజా సంఘాల నేతలు పట్లోల్ల నాగిరెడ్డి, మల్లేష్, గంగ, ఆంజనేయులు, రమేశ్, రాకేష్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మల్ రెడ్డి రామ్‌రెడ్డికి కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ శుభాకాంక్షలు



టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా నూతనంగా నియమితులైన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ హయత్ నగర్ మండల ఎంపీపీ మల్ రెడ్డి రాంరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించిన తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్,ఈ సందర్భంగా కొత్త కుర్మ మంగమ్మ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి ఫలితం కోసం ఎదురుచూడని కార్యకర్త నుండి నాయకుల వరకు కాంగ్రెస్ పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుంది అనేందుకు మల్ రెడ్డి రాంరెడ్డి ఒక ఉదాహరణ అన్నారు.హయత్ నగర్ ఎంపీపీ గా మండల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేశారన్నారు.కాంగ్రెస్ పార్టీ ని బలోపేతం చేసేందుకు ఆయన చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. మల్ రెడ్డి రామ్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుడ్ల అర్జున్ ఉన్నారు.

# ఆధారాల ధ్వంసానికి సహకరించింది ఎవరు?

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :



ఎస్ఐబి మాజీ డిఎస్‌పి ప్రణీత్ రావు 7 రోజుల కస్టడీలో భాగంగా మూడో రోజు ప్రణీత్‌ను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం కీలక సమాచారాన్ని సేకరించింది. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ప్రణీత్‌ను విచారించిన పోలీసులు, ఎవరూ లోనికి రాకుం డా, మీడియా కంటపడకుండా జాగ్రత్త వహించారు. ఎస్ఐబిలో అతనితో పాటు పని చేసిన ఇన్‌స్పెక్టర్ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి అధి కారులను విచారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు, వారి వాంగ్మూలం నమోదు చేశారు. వారు చెప్పిన అంశాల ఆధారంగా ప్రణీత్‌ను ప్రశ్నించారు. డిసెంబర్ 4వ తేదీన ఆధారాలు ధ్వంసం చేసేందుకు ఎవరెవరు సహకరించారని ప్రణీత్‌రావును ప్రశ్నించారు. ఎవరి ఆదేశాల మేరకు ఆధారాలు, ఐఎంఈఐ నంబర్లు, సిడిఆర్, ఐపి అడ్రస్‌ల డేటాను సేకరించారని అతడిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ధ్వంసం చేసి, కొత్తవి ఎందుకు అమర్చాల్సి వచ్చిందని ప్రణీత్‌ను ప్రశ్నించగా మౌనంగా ఉండిపోయినట్లు తెలిసింది. మరోవైపు వికారాబాద్ అడవుల్లో పడేసిన ధ్వంసం చేసిన ఆధారాలు సేకరించాలని భావిస్తున్నారు. ఇందుకోసం ప్రణీత్‌ను స్వయంగా అక్కడకు తీసుకెళ్లి పడేసిన ప్రాంతంలో పోలీసులు గాలించ నున్నారు. రెండో రోజు విచారణ సందర్భంగా హార్డ్‌డిస్క్‌లను కట్టర్లతో కత్తిరించి, వికారాబాద్ అడవిలో పడేసినట్లు ప్రణీత్‌రావు ఒప్పుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రణీత్‌ను వికారాబాద్ తీసుకెళ్లి హార్డ్ డిస్కులకు సంబంధించిన శకలాలు వెతికి, స్వాధీనం చేసుకునేందుకు పోలీ సులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఏడు రోజుల కస్టడీలో భాగంగా ప్రణీత్‌రావును తొలి రోజు రహస్య ప్రాంతానికి తరలించి విచారించిన పోలీ సులు, సోమవారం రోజున బంజారాహిల్స్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసు ఇప్పటికే సంచలనంగా మారడంతో ముందు జాగ్రత్తగా ఠాణా వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. గేట్లు మూసివేసి, ఎవరినీ లోనికి అనుమతించకుండా ప్రణీత్‌ను విచారించారు. మరోవైపు ప్రమోషన్ల ఆశచూపించి కింది స్థాయి సిబ్బందితో ప్రణీత్ రావు ఈ ట్యాపింగ్ వ్యవహారం అంతా నడిపించారని వరంగల్ తో పాటు సిరిసిల్లలో సర్వర్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. ఓ బిఆర్ఎస్ నేత ఆదేశాలతోనే ఈ ట్యాపింగ్ వ్యవహారం నడిపించినట్లు పోలీసులు అనుమా నిస్తున్నారు. సుమారు 100 నెంబర్లను సైతం ప్రణీత్ రావు ట్యాప్ చేశారని అలా సేకరించిన డేటాను 17 కంప్యూటర్ల ద్వారా ప్రైవేట్ డ్రైవ్ ల్లోకి తీసుకున్నట్లు గుర్తించారు. ప్రణీత్ రావు డైరీ నుంచి వందల సంఖ్యలో ఫోన్ నెంబర్లను గుర్తించిన పోలీసులు.. ఈ పని ఆయన ఎందుకు చేయాల్సి వచ్చింది? ఎవరు చెబితే చేయాల్సి వచ్చిందనే విషయంపై దర్యాప్తు కొనసా గిస్తున్నారు. ఈ కేసులో కీలక విషయాలపై కూపీ లాగుతున్న దర్యాప్తు అధికారులు ప్రణీత్ తో కలిసి పని చేసినవారిని విచారి స్తున్నట్లు తెలు స్తోంది. ప్రణీత్ రావు వ్యవహారంలో ఇంటలిజెన్స్ ఉ న్నతాధికారుల ప్రమేయంపైనా ఆరా తీస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో వారికీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. టెక్నికల్ ఎవిడెన్స్‌లను బయటకు తెప్పించేం దుకు నిపుణుల సాయం తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ప్రణీత్ రావు వ్యవహారంలో వెలుగులోకి వస్తున్న విషయాలు రాజకీయంగా పెను సంచలనం కలిగే అవకాశాలు కనిపి స్తున్నాయి.

## భగత్ సింగ్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం

**పిడిఎస్‌యు - పి.వై.ఎల్**

టైమ్స్ ఆఫ్ వార్త - నాగారం




సూర్యాపేట జిల్లా నాగారం మండలం డి. కొత్తపల్లి గ్రామంలో భగత్ సింగ్ 93వ వర్ధంతి పోస్టర్ల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పి. డి. ఎస్. యు రాష్ట్ర ఉపాధ్యక్షులు పోలెబోయిన కిరణ్ పి. వై. ఎల్ జిల్లా నాయకులు వేముల గణేష్ లు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ లు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, భారతదేశ విముక్తి కోసం, స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం తమ విలువైన ప్రాణాలను భారత జాతికి అంకితం ఇచ్చారు. ఉరితాడును ముద్దాడి అమరులయ్యారు. భగత్ సింగ్,రాజ్ గురు, సుఖ్ దేవ్ ల స్ఫూర్తితో యువత యువజన పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. అమెరికా, రష్యా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. దేశంలో రోజురోజుకీ మతోన్మాదం, ఫాసిజం పెరుగుతుంది అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం అయ్యాయ న్నారు. ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక యువత పెడదారి పడుతున్నారన్నారు. భగత్ సింగ్,రాజు గురు సుఖదేవ్ ల వర్ధంతులను పి.డి.ఎస్.యూ.-పి.వై.ఎల్. ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన, వాడవాడనా జరపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లర్ల సోమన్న, నాతి బాలరాజు, మర్రిపల్లి సతీష్, వంగూరి చంద్రం, సైదులు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరిణిలో జరిగిన చక్ర స్నానంలో పాల్గొన్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



తెలంగాణ తిరుమల దేవస్థానం" (టీటీడీ) బీర్కూరు (తిమ్మాపూర్), " లో గత ఆరు రోజులుగా జరుగుతున్న "శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి" వారి " నవమ వార్షిక బ్రహ్మోత్స వాలు" మంగళవారంతో తో ముగిసాయి. "మహా పూర్ణాహుతి" అనంతరం పుష్కరిణిలో జరిగిన "చక్రస్నానం" లో కుటుంబ సభ్యులు, పాలకమండలి సభ్యులు, భక్తులతో కలిసి పాల్గొన్న ఆలయ ధర్మకర్త, మాజీ శాసనసభ సభాపతి, మాజీ మంత్రి, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి-పుష్ప దంపతులు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పోచారం ప్రేమల- శంబురెడ్డి తో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, వెంకటేశ్వర స్వామి భక్తులు, అమ్మ స్వాములు, తదితరులు, పాల్గొన్నారు.

## నెమలి బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ప్రారంభం..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



ఎండ తీవ్రత దినం దినం పెరగడం తో ప్రజల దాహార్తి తీర్చడానికి బాన్సువాడ నియోజకవర్గం నసురు ల్లాబాద్ మండలం నెమలి గ్రామం బస్టాండ్ ప్రధాన రహదారిపై మంగళవారం మన ఊరు మన సాయం సభ్యుల ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మన ఊరు మన సాయం సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు, మహిళలు, తదితరులు, పాల్గొన్నారు.

# మండలంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా







**ఒక్క కూపన్ తో 6 ట్రిప్పులు తోలుతున్న వైనం**

**అక్రమ ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత**

**తనిఖీల్లో పాల్గొన్న రెవెన్యూ అధికారి రమాదేవి**

టైమ్స్ ఆఫ్ వార్త - బోనకల్



మండల పరిధిలోని కలకోట ఇసుక రేవు నుంచి ప్రతిరోజూ ట్రాక్టర్ల ద్వారా ఎటువంటి అను మతులు లేకుండా ఒక్కో ట్రాక్టర్ ఒక కూపన్ పై పలు మార్లు ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాయన్నపేట గ్రామానికీ చెందిన వ్యక్తి ఇసుకను అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గుట్టుచప్పుడు కాకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రెవిన్యూ ఇన్స్పెక్టర్ రమాదేవి తమ సిబ్బందితో కలిసి తనిఖీ చేయగా కూపన్లు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ లను స్వాధీనం చేసుకుని తహసిల్దార్ కార్యాలయానికి తరలించడం జరిగింది.

**అక్రమార్కులకు అండగా తహసిల్దార్ కార్యాలయం?**

ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారికి తాసిల్దార్ కార్యాలయంలో కొంతమంది సిబ్బంది అండదండలు పుష్కలంగా ఉన్నట్లు మండలంలో జోరుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒక్కో కూపన్ కు 500 రూపాయలు చొప్పున తీసుకుంటూ అక్రమ ఇసుక రవాణాకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు మండలంలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇంత జరుగుతున్నా తాసిల్దార్ మాత్రం ఆ అధికారి యొక్క వ్యవహార శైలిపై అంటి ముట్టినట్లుగా వివరించడం వెనుక ఆంతర్యం ఏమై ఉంటుందో అని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

**తాహసిల్దార్ వివరణ:**

అనుమతుల లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసిన విషయంపై తహశీల్దర్ అనిశెట్టి పున్నం చందర్ నీవివరణకోరగా స్వాధీనం చేసుకున్న మూడు ట్రాక్టర్లో రెండిటికి పదివేలు,ఒకదానికి ఐదు వేల రూపాయలను జరిమాన విధించినట్లు ఆయన పేర్కొన్నారు.అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని,వాహనాలకు ఇన్సూరెన్స్,డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని అలాంటి వారిపై పోలీసు అధికారులతో సమీక్షించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

TIMES OF VARTHA (20-03-24)_times of varha main (13-2).qxd 3/20/2024 5:28 AM Page 7



## తాడుకోల్ 2బిహెచ్ కె అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్షం వారోత్సవాలు..

టైమ్స్ ఆఫ్ వార్త - బాన్సువాడ:



బాన్సువాడ సెక్టార్ పరిధిలోని తడ్కోల్ డబుల్ బెడ్ రూమ్ అంగన్వాడి కేంద్రంలో పోషన్ భి పడాయి భి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పూర్వ ప్రాథమిక విద్య ప్రాముఖ్యత, పోషకాహారం ,గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన ఆహారం ,జాగ్రత్తలు , బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు,ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు, ఏడు నెలలు నిండిన వెంటనే అనుబంధ పోషకాహారం మొదలుపెట్టడం మొదలకు అంశములపై అవగాహన కలిగించడం జరిగింది. ఈ,కార్యక్రమంలో సూపర్వైజర్ సౌభాగ్య,అంగన్వాడీ టీచర్ లలిత,గ్రామంలోని తల్లులు, సిబ్బంది, తదితరులు, పాల్గొనడం జరిగింది.

## అమ్మను కలిసేందుకు కవితకు అనుమతి



టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన బిఆర్ఎ స్ ఎంఎల్సి కవిత, గతంలో తాను సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిష న్ను వెనక్కి తీసుకున్నారు. ఈ కేసు విషయంలో విచారణకు హాజరు కావాలం టూ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ గతేడాది మార్చి 14న కవిత సుప్రీంను ఆశ్రయించారు. సిఆర్పిసి నిబంధనల ప్రకారం మహిళలను కార్యాలయాల్లో విచారణ చేయకూడదని, ఈ మేరకు ఇడిని ఆదేశించాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో వ్యాజ్యం దాఖలు చేశా రు. ఈ పిటిషన్పై అత్యవసర విచారణ చేపట్టాలంటూ కవిత తరఫు న్యాయ వాదులు కోరగా, అందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. మార్చి 24న విచారిస్తామని స్పష్టం చేసింది. అప్పుడూ వాయిదా పడి, చివరకు 27న తొలిసారి ఈ పిటిషన్పై విచారణ జరిగింది. ఈ రిట్ పిటిషన్పై అప్పటికే ఇడి కెవియట్ పిటిషన్ దాఖలు చేయడంతో రెండింటిపై సుప్రీం విచారించింది. అప్పటి నుంచి ఈ వ్యాజ్యం వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తోంది. సంవత్సర కాలంగా కోర్టులో నలుగుతున్న ఈ పిటిషన్పై ఈ నెల 15న మరోమారు విచారించిన సుప్రీం, ఇరువురి తరఫు న్యాయవాదుల సుదీర్ఘ వాదనల అనంతరం మంగళవారానికి వాయిదా వేసింది. మంగళవారం మరోసారి దీనిపై విచారణ జరగాల్సి ఉంది. అయితే ఈ కేసులో ఇప్పటికే కవిత అరెస్ట్ కావడంతో ఈ రిట్ పిటిషన్పై విచారణ అవసరం లేదని భావించిన ఆమె తన పిటిషన్ను వెనక్కి తీసుకున్నారు. ఈ మేరకు కవిత తరఫు న్యాయవాది విక్రమ్ చౌదరి తమ వ్యాజ్యాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పిటిషన్ ఉప సంహరణకు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ బెంచ్ అనుమంతిచారని తెలిపారు. ఈ కేసులో చట్ట ప్రకారం ఉపశమనం పొందేందుకు తదుపరి చర్యలకు వెళ్తామని ఆయన స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసుకు సంబంధించి బిఆర్ఎస్ ఎంఎల్సి కవితతో పాటు వైఎస్సార్సిపి ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డికి చెందిన బినామీలు అరుణ్ రామచంద్రపిళ్లై, ప్రేమ్ రాహుల్, సౌత్ గ్రూపు ద్వారా ఆప్ నేతలకు రూ.100 కోట్లు చెల్లించి, మద్యం విధానాన్ని అనుకూలంగా మలచు న్నారని ఇడి అభియోగం మోపింది. దీనిపై గతేడాది మార్చి 11న తొలిసారి కవితను విచారించిన ఇడి అధికారులు, 16న మరో సారి హాజరు కావాలని సమన్లు జారీ చేశారు. ఈ సమన్లను సవాల్ చేస్తూ అదే నెల 14న కవిత సుప్రీంలో అత్యవసర విచారణ (రిట్) పిటిషన్ దాఖలు చేశారు.

### అమ్మను కలిసేందుకు కవితకు అనుమతి

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై ఇడి కస్టడీలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మె ల్సీ కవిత 'మా అమ్మను కలిసేందుకు అనుమతిం చండి' అంటూ న్యాయస్థా నాన్ని అభ్యర్థించారు. తల్లితో పాటు కుమారులను కలుసుకునేందుకు కూడా అనుమతించాలని న్యాయ స్థానాన్ని కోరారు. ఈ మేరకు రౌస్ అవెన్యూ కోర్టు లో కవిత తరపు న్యాయవాదులు మంగళవారం పిటిషన్ దాఖలు చేశారు. కవి త అభ్యర్థనకు న్యాయస్థానం అంగీ కరించింది. తల్లి శోభ, కుమారులు ఆది త్య, ఆర్య, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డిల ను కలుసుకునేందుకు న్యాయ స్థానాన్ని కవిత అనుమతి కోరారు. ఈ క్రమం లో తల్లీ, కుమారులు, కుటుంబసభ్యులను కలిసేందుకు కవితను న్యాయ స్థానం అనుమతిం చింది. కాగా ఇడి కస్టడీకి అనుమతించిన శనివారం రోజు భర్త అనిల్, సోదరుడు కెటిఆర్, బావ హరీశ్ రావు, కజిన్ బ్రదర్స్ పి శ్రీధర్, ప్రణీత్ కుమార్, పిఎ శరత్ చంద్రలను కలుసుకునేందుకు కోర్టు అంగీ కరించిన విషయం విదితమే. కస్టడీలో ఉన్న ఏడు రోజుల్లో ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల మధ్య బంధువులను కలుసుకు నేందుకు కవితకు న్యాయస్థానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఎక్కువ మంది ని కలవడం వల్ల దర్యాప్తుకు ఆటంకం కలుగుతుందని మంగళవారం కవిత తాజా పిటిషన్పై విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది. దీంతో ముం దుగా అనుమతించిన వారిలో కేటీఆర్ పేరుతో పాటు తల్లి, కుమారులు, సోదరీమణులు అఖిల, సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్ రెడ్డి కలిసేందుకు అనుమతించాలని కవిత తరఫు న్యాయవాదులు వెల్లడించారు. దీంతో ఆ మేరకు న్యాయస్థానం అంగీకారం తెలిపింది.

## కొత్త గవర్నర్ సీపీ రాధాకృష్ణన్

(మొదటి పేజీ తరువాయి)..

మాజీ గవర్నర్ తమిళిసై, ప్రస్తుత గవర్నర్ రాధాకృష్ణన్ మధ్య పలు అంశాల్లో సారూప్యత ఉన్నది. ఈ ఇద్దరు కూడా తమిళనాడుకు చెందిన వారే. ఇద్దరూ తమిళనాడు బీజేపీలో కీలక నేతలే. ఆరెస్సెస్ భావజాలం కలిగిన రాధాకృష్ణన్ రాష్ట్ర బీజేపీలో కీలక నేతగా ఎదిగారు. 1998, 1999లో కోయంబత్తూర్ నుంచి ఎంపీగానూ గెలుపొందారు. ఆ తర్వాత 2004, 2014, 2019లో ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. 2004 నుంచి 2007 వరకు బీజేపీ తమిళనాడు రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించారు. తమిళిసై కూడా 2014 నుంచి 2019 వరకు బీజేపీ తమిళనాడు అధ్యక్షురాలిగా కొనసాగడం గమనార్హం.

## రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అభిష్టానం మేరకే

# భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి!

- భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పైళ్ళ శేఖర్ రెడ్డిహా?.. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సతీమణియా ?
- పార్లమెంట్ ఎన్నికల అనంతరం భువనగిరిలో బీఆర్ఎస్ ఖాళీయేనా?





టైమ్స్ ఆఫ్ వార్త - యాదాద్రి

పార్టీ మారనున్న నేతలకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇస్తుందన్న ప్రచారం ఉ పందుకుంటుంది. అధికార పార్టీ కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో పలు విధాలుగా కామెంట్లను ట్రోలింగ్ చేస్తు న్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన అభ్యర్థి గత మూడు నెలలుగా ఎటువంటి కామెంట్లు చేయ కుండా బీఆర్ఎస్ పార్టీ చేపట్టే కార్యక్రమాలలో అంటి ముట్టనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో ఉమ్మడి నల్ల గొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ మంత్రులు సీనియర్ నాయకులు భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని ప్రతిష్టాత్మక తీసుకొని విజయం సాధిం చుకోవాలన్న ఆలోచనలో ఎంపీ సీటు కోసం దరఖాస్తు చేసు కున్న ఆశావాహులతో పాటు గెలుపు గుర్రాల కోసం పలుమార్లు కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా సర్వేలు చేయిం చుకున్నది. ఇటీవల కొంతకాలంగా పార్లమెంట్ సెగ్మెంట్లలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో కనీసం పలుకుబడి కలిగిన వ్యక్తుల అన్వేషణలో రాష్ట్ర కేంద్ర నాయకత్వాలు సర్వేలు చేయించాయి. ఏమాత్రం పలుకుబడి లేని నాయకులను బరిలో దింపితే ఓటమిపాలయ్యే అవకాశం ఉందన్న ఆలోచనలు కోమటిరెడ్డి బ్రదర్స్ కు సంబంధించిన వాళ్ళ పేర్లను కూడా కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వం బలమైన వ్యక్తి కోసమే గాక పార్లమెంట్ సెగ్మెంట్లలో ఫేస్ వాల్యూ, పొలిటికల్ వ్యాల్యూ, కలిగిన ఉన్న అభ్యర్థి కోసం పల్ దఫాలుగా అన్వేషణ చేసిందన్న విషయం తెలిసింది. ఒకవేళ భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన శేఖర్ రెడ్డి ని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించినట్లయితే మూ డు నెలలు నాటి ప్రత్యర్థులు జరగబోవు వాల్మీకి ఎన్నికల్లో ఒకరికొకరు సహాయ సహకారా లు అందించుకుంటూ సహితంగా ప్రచారంలో పాల్గొన బోతున్నారు. అంతేగాక భువనగిరి ఎమ్మెల్యే కొమ్మ అనిల్ కుమార్ రెడ్డి, బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉండి ఓటమిపాలైన విషయం తెలిసిందే. అంతేగాక వీరు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా విమర్శలు చేసుకున్న ప్రతి విమర్శలకు అటువంటి ఇరు పార్టీల క్యాడర్ కలిసి రెండు నెలలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాల్సి ఉంటుంది. ఇటువంటి విపత్కర పరిస్థితులు భువనగిరి నియో జకవర్గం ప్రజలు చూడబోతున్నారు. అంతేగాక మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణిని భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దింపేందుకు విష ప్రయత్నాలు చోటు చేసుకుంటున్నాయని విశ్వసనీయ సమాచారం. అంతేగాక భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కూతురు కుంభం కీర్తి రెడ్డిని బరిలో దింపేందుకు ఎమ్మెల్యే ఇటీవల కాలంలో తెలంగాణ టీపీసీసీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో ఈ విషయం చర్చించినట్లు తెలిసింది. అంతేగాక అనిల్ కుమార్ రెడ్డి సన్నిహిత బం ధువులు కూడా రేవంత్ రెడ్డి తో కలిసి కీర్తి రెడ్డికి టికెట్ ఇప్పి చ్చేందుకు సమాలోచనలు జరిగినట్లు విశ్వాసమే సమాచారం. ఏది ఏమైనా భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇన్చార్జ్, రాష్ట్ర క్యాబినెట్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నిర్ణయం మేరకే భువనగిరి పార్లమెంట్ సెగ్మెంట్లో బరిలో దిగే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పేరు ఖరారు కానున్నదని రాజకీయ విశ్లేష ణకు అభిప్రాయపడుతున్నారు. ఇదేమైనా విశ్వసనీయ సమాచార మేరకు ఆత్మకూరి మండలం నాంచారి పేట కదిరేనిగూడెం గ్రామానికి చెందిన స్వర్గీయ రామ్ రెడ్డి కుమారుడు పైళ్ళ శేఖర్ రెడ్డి 1 జనవరి 1968లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఆయన ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలో, భువనగిరి బీచ్ మహల్లా హైస్కూల్లో ఎస్ఎస్సి వరకు విద్య అభ్యసించారు.

అనంతరం సివిల్ ఇంజనీరింగ్లో డిప్లొమా ఎస్ఈఎస్ఎస్ఎన్ మూర్తి పాలిటెక్నిక్ కాలేజ్ ఖమ్మంలో పూర్తి చేశారు. అనంతరం తన సన్నిహితులతో హైదరాబాదు, కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు తదితర ప్రాంతాలలో బిల్డర్గా డెవలపర్గా వ్యాపారాన్ని కొనసాగించి పేరు ప్రఖ్యాతలు సాధించారు. 2014 కన్న పూర్వం ఆలేరు నియోజకవర్గంలో పైళ్ల ఫౌండేషన్ ఏర్పాటు చేసి గ్రామ గ్రామాన పేద ప్రజలకు రైతులకు సహాయ సహకారాలు అందిస్తూ 2014లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. అనుకోని పరిస్థితులలో జిల్లా నాటి మంత్రి ఆశీస్సులతో బిఆర్ఎస్ పార్టీ తుది నిమిషంలో టికెట్ ఇవ్వడంతో సమీప అభ్యర్థిపై భారీ మెజార్టీతో విజయ సాధించారు. తదనంతరం జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై విజయం సాధించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభం అనిల్ కుమార్ రెడ్డి చేతిలో 24000 ఓట్లతో ఓటమిపాలయ్యారు. అన్యోన్యంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగనున్నారని ప్రచారం రూపొందించుకోవడంతో నియోజక వర్గంలో మిశ్రమ స్పందన కనిపిస్తుంది. అంతేగాక పైళ్ళ శేఖర్ రెడ్డి కి ఆలేరు నియోజకవర్గంలో మంచి పలుకుబడి ఉందని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించి సర్వేలో తెలిసిందని విశ్వసనీయ సమాచారం. ఇది ఏమైనా కాంగ్రెస్ నాయకత్వం భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పైళ్ల శేఖర్ రెడ్డి పేరును ఖరారు చేసినట్లయితే కాంగ్రెస్ పార్టీ క్యాడర్ బీఆర్ఎస్ పార్టీ కేడర్ మమేకం కావాల్సి వస్తుంది. ఎన్నికల అనంతరం భువనగిరి నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి సెకండ్ గ్రేడ్ నాయకత్వ లోపం స్పష్టంగా కనిపించనున్నది. స్వర్గీయ ఎలిమినేటి మాధవరెడ్డి కుమారుడు ఎలిమినేటి సందీప్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా జిల్లా పరిషత్ బిఆర్ఎస్ పార్టీ చైర్మెన్గా కొనసాగుతున్న నియోజకవర్గ వ్యాప్తంగా తన తండ్రి స్వర్గీ ఎలిమినేటి మాధవరెడ్డి సంపాదించిన పేరు ప్రఖ్యాతులను ఆతను సంపాదించలేకపోయాడని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా బీఆర్ఎస్ పార్టీ మాజీ భువనగిరి ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ పార్టీ అభ్యర్థిగా బరిలో దిగితే బిఆర్ఎస్ పార్టీ ఖేల్ ఖతం కానున్నదని పలువురు రాజకీయ నేతలు భావిస్తున్నారు..

## కాంగ్రెస్ కసరత్తు పూర్తి..!

(మొదటి పేజీ తరువాయి)..



ప్రకటించాలని భావించారు. అయితే ఐదు లోక్సభ స్థానాలకు ఎక్కువమంది ఆశావహులు ఉ ండడంతో వాటిపై పీటముడి పడింది. దీంతో అవి మినహా మిగిలిన 8 స్థానాలపై చర్చించి ఆమోద ముద్ర వేశారు. చేవెళ్ల నుంచి రంజిత్రెడ్డి, మల్కాజ్గిరి నుంచి సునీతా మహేందర్ రెడ్డి, నాగర్కర్నూల్ నుంచి మల్లు రవి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ జీవన్రెడ్డి, ఆదిలాబాద్ నుంచి డాక్టర్ సుమలత, కరీంనగర్ నుంచి ప్రవీణ్రెడ్డి, వరంగల్ నుంచి పసునూరి దయాకర్ల పేర్లు పరిగణనలోకి తీసుకుని గ్రీన్సిగ్నల్ ఇచ్చారు. ఖమ్మం, సికింద్రాబాద్, భువనగిరి, హైదరాబాద్, మెదక్ స్థానాలపై ఈ నెల 21న మరోసారి జరుగనున్న సీఈసీ భేటీలో చర్చించే అవకాశం ఉందని ఏఐసీసీ వర్గాలు చెపుతున్నాయి.

**ఆరు స్థానాలపైనే చర్చ: గాంధీభవన్ వర్గాలు**

గాంధీభవన్ వర్గాల సమాచారం ప్రకారం.. సీఈసీ భేటీలో ఆరు స్థానాలపైనే చర్చ జరిగింది. అయితే ఐదు స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ఖరారు చేశారు. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, చేవెళ్ల నుంచి రంజిత్రెడ్డి, మల్కాజ్గిరి నుంచి సునీతా మహేందర్రెడ్డి, నాగర్కర్నూల్ నుంచి మల్లు రవి, ఆదిలాబాద్ నుంచి డా.సుమలతల అభ్యర్థిత్వాలకు సీఈసీ ఆమోదం తెలిపింది. భువనగిరిపై కూడా చర్చ జరిగినా.. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్రెడ్డి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్రెడ్డి సతీమణి కోమటిరెడ్డి లక్ష్మిల్లో ఒకరిని ఖరారు చేయాలా? ఇంకెవరికైనా అవకాశం కల్పించాలా? అన్న దానిపై మరోమారు చర్చించాలనే నిర్ణయానికి వచ్చారు. మొత్తం మీద బుధవారం అధికారికంగా జాబితా ప్రకటించే అవకాశం ఉందని, కానిపక్షంలో మరుసటి రోజు విడుదల చేస్తారని చెబుతున్నారు. అయితే 8 స్థానాలకు ప్రకటిస్తారా లేక ఐదుకే పరిమితమవుతారా? అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది.

## కాలుష్య రాజధానిగా ఢిల్లీ

(మొదటి పేజీ తరువాయి)..



ఘోషిస్తోంది. దేశ జనాభాలో 96 శాతం మంది అంటే 133 కోట్ల మంది డబ్ల్యూహెచ్వో పరిమితికి ఏడు రెట్లు మించి కాలుష్యమయ వాతావరణంలో జీవిస్తున్నారు. భారత్లోని 66 శాతం నగరాలు సగటున ఘనపు మీటర్కు 35 మైక్రోగ్రామ్ల ధూళికణాలున్న వాయు కాలుష్యం బారిన పడ్డాయి.

### విభిన్న మార్గాల్లో, విస్తృతస్థాయి డేటా

ప్రపంచవ్యాప్తంగా 134 దేశాల్లో ఏర్పాటుచేసిన 30,000 వాయునాణ్యతా ప్రమాణాల స్టేషన్లు, సెన్సార్లు సేకరించిన డేటాను క్రోడీకరించి ఈ నివేదికను తయారుచేసినట్లు ఐక్యూఎయిర్ తెలిపింది. అధ్యయన సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, విశ్వవిద్యాలయాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వేతర లాభాపేక్షలేని సంస్థలు, ప్రైవేటు కంపెనీలు, పౌర శాస్త్రవేత్తల నుంచి తీసుకున్న డేటాను ఈ నివేదిక కోసం వినియోగించినట్లు సంస్థ పేర్కొంది.

### ఆసియా '100'లో 83 భారత్లోనే

ప్రపంచవ్యాప్తంగా కాలుష్యానికి కేరాఫ్ అడ్రస్గా భారత్ పేరుమోస్తోంది. ఆసియాలో అత్యంత కాలుష్యమయ 100 నగరాల జాబితా ప్రకటించగా అందులో 83 నగరాలు భారత్లో ఉండటం దారుణ పరిస్థితికి దర్పణం పడుతోంది. కొన్ని నగరాల్లో కాలుష్యం డబ్ల్యూహెచ్వో పరిమితిని పది రెట్లు దాటేయడం గమ నార్హం. కాలుష్యానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా 7,800 నగరాలను పరిశీలిస్తే అందులో డబ్ల్యూహెచ్వో పరిమితికి లోబడి కేవలం 9 శాతం నగరాలు ఉండటం చూస్తే పరిస్థితి చేయిదాటిపోయిందని అర్థమవుతోంది. ' ఫిన్లాండ్, ఎస్తోనియా, ప్యూర్టోరికో, ఆస్ట్రేలి యా, న్యూజిలాండ్, బెర్ముడా, గ్రెనెడా, ఐస్ల్యాండ్, మారిషస్, ఫ్రెంచ్ పాలినేసియా దేశాల్లో మాత్రం వాయు నాణ్యత బాగుంది.

**PRINTED, PUBLISHED & OWNED BY** G.JANARDHAN REDDY, H.NO, 16-11-511/B/7,OPP : STREET KRISHINANDA MATAM, DILSUKHNAGAR, HYDERABAD-36. PRINTED AT y.v. reddy, binding works, h.no.5-20, shivani hotel line, gurga nagar, Hyderabad-36, Telangana.Editor G.JANARDHAN REDDY, RNI NO. **APTEL/2007/22828** CELL: 9948789066